

18న ఆశావర్కర్ల...

చలో కలెక్టరేట్

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని ఈనెల 18న చలో కలెక్టరేట్‌కు తరలి రమ్మని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.అంజి బాబు కోరారు. ఆదివారం సిఐటియు కార్యాయంలో ఆశావర్కర్ల జిల్లా కమిటీ సమావేశం సంఘం జిల్లా అధ్యక్షులు శివలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. అంజిబాబు, ఆశావర్కర్ల యూనియన్ గౌరవాధ్యక్షులు జె.నాగేశ్వరరావు మాట్లాడారు. ఆశ వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఇన్సూరెన్స్ సెలవులు, రిటైర్డ్ బెనిఫిట్స్ ఇవ్వాలని, పని భారం తగ్గించాలని ఈనెల 18న చలో కలెక్టరేట్ కార్యక్రమానికి తరలిరావాలని వారు కోరారు. ఆశ వర్కర్లు 26 రకాల పనులు గత 18 సంవత్సరాల నుండి ప్రభుత్వానికి ప్రజలకు వైద్య సేవలు అందిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారని తెలిపారు. 14 రకాల యాప్‌లు పెట్టి పని భారాన్ని పెంచుతున్నారని, మా పని భారం వల్ల మానసిక ఒత్తిడికి గురై ఆశ వర్కర్లు అనారోగ్యం పాలవుతున్నారని చెప్పారు. అనారోగ్యంతో మరణించిన కుటుంబానికి ప్రభుత్వం ఎలాంటి నష్టపరిహారం ఇవ్వటం లేదన్నారు. ప్రభుత్వం ఆశ వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించి, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇచ్చి, నష్టపరిహారం చెల్లించే విధంగా ఉత్తర్వులివ్వాలని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా అధ్యక్షురాలు శివలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వ మహిళా ఉద్యోగులకు అన్ని రకాల సౌకర్యాలు ఉన్నాయని, ఆశారంగంలో కూడా మహిళలు ఉన్నారని వారికి ప్రభుత్వ సౌకర్యాలు కల్పించటం లేదన్నారు. తక్షణమే క్యాజువల్ లీవులు, మెడికల్ లీవులు, మెటర్నిటీ లీవులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రిటైర్మెంట్ 62 సంవత్సరాలు కొనసాగించాలని, రూ. 5 లక్షల ఇవ్వాలని, ఇన్సూరెన్స్ రూ.20 లక్షలు ఇవ్వాలని ఆమె ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈనెల 18న నిర్వహించే కలెక్టరేట్ ధర్నాలో పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. డిసెంబర్ 15న అఖిలభారత కిసాన్ సభ జాతీయ కౌన్సిల్ సమావేశాలు కర్నూలులో జరుగుతున్నాయని 15 జరిగే బహిరంగ సభకు ఆశ వర్కర్లు హాజరు కావాలని కోరారు. సమావేశంలో నాగార్జునమ్మ, శేషమ్మ, కాంతమ్మ, రాధమ్మ, ఈశ్వరి బాయి, శాంతకుమారి, చిప్పగిరి నుండి యూనియన్ నాయకురాలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

అందని 'కంది'...

- రేషన్ లబ్ధిదారులకు నిరాశ - బహిరంగ మార్కెట్‌లో ధరాఘాతం

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

తెల్ల రేషన్ కార్డుదారులకు అందించే రేషన్‌తో పాటు ఇవ్వాల్సిన కందిపప్పు అందడం లేదు. నాలుగు నెలలుగా కందిపప్పు అందకపోవడంతో లబ్ధిదారులకు నిరాశే మిగులుతోంది. బహిరంగ మార్కెట్‌లో ధర అధికంగా ఉండడంతో సామాన్యులకు ధరాఘాతం తప్పడం లేదు...



ఉమ్మడి కర్నూలు జిల్లాలో రేషన్ కార్డుదారులకు కందిపప్పు సరఫరా అంతంత మాత్రంగానే ఉంది. నిత్యావసర సరకుల ధరలు కొండెక్కి కూర్చోవడంతో రేషన్ సరుకుల్లో బియ్యంతో పాటు కంది పప్పు ఇస్తామని పాలకులు గత ఆరేడు నెలలుగా చెబుతూనే ఉన్నారు. కార్డుదారులు ప్రతి నెలా ఆశగా ఎదురుచూస్తూనే ఉన్నారు. వారికి నిత్యం నిరాశే ఎదురవుతోంది. ఈ నెలలోనూ పూర్తిస్థాయిలో కోటా రాకపోవడంతో కొందరికి మాత్రమే అందే పరిస్థితి నెలకొంది. నవంబరు నెలలో కర్నూలు జిల్లాకు 400 టన్నులు, నంద్యాల జిల్లాకు 350 టన్నుల కంది పప్పును రెండు విడతల్లో సరఫరా చేస్తామని పౌరసరఫరాల ఉన్నతాధికారులు తెలిపారు. అక్టోబరు చివరి నాటికి, నవంబరు మొదటి వారంలో కలిపి ఉమ్మడి జిల్లాలకు 750 టన్నుల కంది పప్పు అంటే ఒక్కో కార్డుదారుడికి కిలో చొప్పున 7.50 లక్షల మందికి అందించాల్సి ఉంది. ఉమ్మడి జిల్లాలో 12.10 లక్షల మంది కార్డుదారులు ఉండగా కేవలం 24,667 మందికి మాత్రమే పంపిణీ చేయడం గమనార్హం. బహిరంగ మార్కెట్‌లో కందిపప్పు కిలో రూ.180 వరకు చేరింది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం నాఫెడ్ నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి కందిపప్పును కేటాయించడం లేదనే విమర్శలున్నాయి. ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం కార్డుదారులకు కందిపప్పు అందించలేని పరిస్థితి నెలకొంది. ఫలితంగా పేదలు ఇబ్బందులు పడుతున్నారు. అయినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. కార్డుదారులకు గత ఐదారు నెలలుగా కంది పప్పు అందడం లేదు. ఈ నేపథ్యంలో కంది పప్పు లేకుండా ఎండియు వాహనాన్ని తమ వీధికి తీసుకు రావొద్దంటూ కార్డుదారులు ఆపరేటర్లపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బహిరంగ మార్కెట్లో కిలో కందిపప్పు రూ.160-180 వరకు ఉంది. ఇంటింటికి రేషన్ పంపిణీలో భాగంగా ప్రభుత్వం కిలో రూ.67కే అందించాల్సి ఉంది. బహిరంగ మార్కెట్లో ధరలు పెరిగినప్పుడు పేదలకు కందిపప్పు పంపిణీ చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నప్పటికీ ఏమాత్రం పట్టించుకోవడం లేదు. దీనిపై లబ్ధిదారుల నుంచి తీవ్ర ఆగ్రహం వ్యక్తం అవుతోంది.

ఐదు నెలలుగా కందిపప్పు లేదు

రేషన్ సరుకులతో పాటు ఇచ్చే కందిపప్పు ఐదు నెలలుగా ఇవ్వడం లేదు. రేషన్‌తో పాటు ఇచ్చే దాన్ని వాడే వాళ్లం. బయట రూ.160 పెట్టి కొనుక్కోవాల్సి వస్తోంది. ప్రభుత్వం రేషన్‌తో పాటు కందిపప్పు అందిస్తే బాగుంటుంది.

- వరలక్ష్మి, శ్రీరామ్ నగర్, కర్నూలు.

యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులుగా సురేష్ కుమార్

- హర్షం వ్యక్తం చేసిన జిల్లా కమిటీ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు జిల్లా నుండి ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) రాష్ట్ర సహాధ్యక్షుడుగా కె.సురేష్ కుమార్ మరోసారి ఎన్నికయ్యారు. గత రెండు రోజులుగా ఏలూరులో జరుగుతున్న యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల్లో ఆదివారం నూతన రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాష్ట్ర నూతన కార్యవర్గంలోకి నాలుగోసారి కర్నూలు జిల్లా నుండి రాష్ట్ర సహాధ్యక్షుడుగా కె.సురేష్ కుమార్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రవికుమార్ ,నవీన్ పాటి, జిల్లా నాయకులు హేమంత్ కుమార్ , యెహోషువ తిమ్మన్న, రాష్ట్ర కౌన్సిలర్ జయరాజు, మహిళా నాయకులు నాగమణిలు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా రవికుమార్, నవీన్ పాటీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని విస్మరిస్తుందని పేర్కొన్నారు. ఉపాధ్యాయులకు వేతనాల చెల్లింపుతో పాటు ఇతరత్రా ఆర్థిక అంశాలను పరిష్కరించడంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందని పేర్కొన్నారు. కౌన్సిల్ సమావేశాల్లో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమ కార్యచరణ కూడా రూపొందించినట్లు పేర్కొన్నారు.



సురేష్‌తో జిల్లా నాయకులు

చెత్త లేని నగరమే లక్ష్యం

- కలుషిత నీరు నదులలో కలువకుండా చర్యలు
- కార్పొరేషన్ ప్రజాఆరోగ్య అధికారి విశ్వేశ్వర రెడ్డి

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్



'కర్నూలు నగరాన్ని చెత్తలేని నగరంగా తీర్చిదిద్ది ప్రజల ఆరోగ్యమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తున్నాం. సెత్తసేకరణపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. మురుగునీటిని శుద్ధి చేసేందుకు ప్రత్యేక ప్లాంటులు ఉన్నాయి. కొత్తవి ఏర్పాటు చేస్తున్నాం. భవిష్యత్తులో నగరంలో ప్రవహించే నలులలో నీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకుంటాం. ప్రాధాన్యతా క్రమంలో దోమల నివారణకు పాగింగు చేస్తున్నాం.' నగరపాలక సంస్థ ప్రజా ఆరోగ్య అధికారి డాక్టర్ కె.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. ప్రజాశక్తి ముఖాముఖిలో ఆయన మాట్లాడారు.

ప్రజారోగ్యవిభాగంలో ఎంతమంది కార్మికులు పనిచేస్తున్నారు?

ఎంహెచ్‌ఒ: నగరపాలక సంస్థ పరిధిలో 1068 మంది కార్మికులు పనిచేస్తున్నారు. అందులో రెగ్యులర్ 195 మంది, కాంట్రాక్ట్ కార్మికులు 873 మంది ఉన్నారు.

ప్రస్తుతం నగరంలో చెత్త ఎక్కడపడితే అక్కడ ఎక్కువగా కనిపిస్తుంది కారణం ఏమిటి?

ఎంహెచ్‌ఒ: ప్రజల్లో అవగాహన లోపం వల్లనే వీధిలో ఎక్కడపడితే అక్కడ చెత్త కనిపిస్తుంది. ఇంటింటికి తడి, పొడి చెత్త సేకరించేందుకు ఆటోలు వస్తున్నప్పటికీ వారికి ఇవ్వకుండా చెత్త సేకరణ తర్వాత తెచ్చి బయటపడేయడం వల్ల చెత్త కనిపిస్తుంది. చెత్త బయటపడేయడం వల్ల తమ ఆరోగ్యమే చెడిపోతుందనే అవగాహన కలిగేంత వరకు ప్రజల్లో మార్పు రాదు.

ప్రతిరోజు ఎన్ని టన్నుల చెత్త సేకరిస్తున్నారు.?

ఎంహెచ్‌ఒ: ప్రతిరోజు 1080 టన్నుల చెత్త సేకరణ చేస్తున్నాం. అందులో 18 టన్నులు తడిచెత్త వస్తుంది. దాని ద్వారా ఎరువును తయారు చేస్తున్నాం. పొడి చెత్తను జిందాల్ లో సిమెంట్ ఫ్యాక్టరీ వారికి ఇస్తున్నాం.

ఎన్ని ఆటోల ద్వారా నగరంలో చెత్త సేకరిస్తున్నారు.?

ఎంహెచ్‌ఒ: కార్పొరేషన్‌కు సంబంధించినవి 12 ,ప్రైవేటు ఆటోలు 91 మొత్తం 103 ఆటోలు చెత్త సేకరణకు నగరంలో వినియోగిస్తున్నాం. తడి, పొడి చెత్త సేకరణ కోసం ఆబ్కాస్ ద్వారా నగరంలో చెత్త సేకరించేందుకు 2022 మార్చి ఒకటి నుండి ఆటోలు ఇచ్చాం. వీటితోపాటు 19 ట్రాక్టర్లు, కమ్‌ప్యాక్టర్లు, ఐదు పెద్దవి, 10 చిన్నవి మొత్తం 15 ఉన్నాయి. రెండు టిప్పర్లు కొత్తవి, రెండు పాతవి ఉన్నాయి.

కుక్కల బెడద ఎక్కువైంది ఏం చర్యలు తీసుకుంటున్నారు?

ఎంహెచ్‌ఒ: ప్రభుత్వ ఆదేశాల ప్రకారం తాము కుక్కలను చంపకూడదు. ఎక్కడ ఎక్కువఉంటున్నాయో అక్కడ ప్రాధాన్యతను బట్టి ముందుగా ఆ వీధుల్లో కుక్కలను పట్టుకుని ఆపరేషన్లు చేయించే బాధ్యతను ఎన్‌జిఒకు అప్పగించాం. ఆ ఎన్‌జిఒనే డాక్టర్ను ,కుక్కలు పట్టేందుకు, కుక్కల ఆపరేషన్ అనంతరం తిండి, ఆపరేషన్ ఖర్చు అన్ని వారే భరించాల్సి ఉంటుంది. ఒక్కో కుక్కకు రూ.1360 చొప్పున ఎన్‌జిఒకు చెల్లిస్తున్నాం. గార్గేయపురం డంపింగ్ యార్డ్ దగ్గర కుక్కల ఆపరేషన్ చేసే వాటి సంరక్షణ కోసం 100 బోన్లు ఉన్నాయి. ప్రతిరోజు 20 కుక్కలకు మాత్రమే ఆపరేషన్లు చేస్తున్నాం. వాటికి రాబిస్ వ్యాక్సిన్ కూడా వేస్తున్నారు. ఆపరేషన్ అనంతరం తిరిగి అక్కడే వదిలిపెడతాం. వాటి పర్యవేక్షణ కోసం ఒక వెటర్నరీ డాక్టర్ కూడా ఉన్నారు.

కాలువల్లో సిల్టు పేరుకుపోయి మురుగు నీరు రోడ్లపై ప్రవహిస్తుంది. కాల్వలోని మురుగనీరు నదుల్లో చేరి కలుషితమవుతుంది. ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎంహెచ్‌ఒ: మురుగునీరు కెసి కెనాల్, హంద్రీ, తుంగభద్రా నదులలో వదలడం చట్టరీత్యా నేరం. ప్రస్తుతం మురుగునీరు శుద్ధి చేసే ప్లాంట్లు టిజి. వెంకటేష్ ఇంటి వద్ద ఒకటి ఉన్నది. జొహరాపురం వద్ద ఒకటి, కల్లూరు దేవనగర్ బ్రిడ్జి వద్ద ఒకటి మురుగునీటి శుద్ధి కేంద్రాలు నిర్మాణంలో ఉన్నాయి. అవి పూర్తి అయిన వెంటనే మరుగు నీరు నదులలో కలవకుండా అక్కడ శుద్ధి చేసి ఆ నీటిని డివైడర్లు, పార్కులలో, రోడ్ సైడ్‌లలో పెంచిన మొక్కలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తాం.

పారిశుధ్య కార్మికులకు కావలసిన సేఫ్టీపరికరాలు ఇస్తున్నారా?

ఎంహెచ్‌ఒ: పారిశుధ్య కార్మికులకు కావలసిన ఆప్రాన్లు, చీపుర్లు, కొబ్బరినూనె, బట్టలు, చెప్పులు ఇస్తున్నాం.

దోమల నివారణకు ఫాగింగ్ రెగ్యులర్‌గా చేస్తున్నారా?

ఎంహెచ్‌ఒ: ప్రాధాన్యత క్రమంలో ఫాగింగ్ చేస్తున్నాం. ప్రతి శుక్రవారం డ్రైడేను కూడా నిర్వహిస్తున్నాం.

పారిశుధ్య కార్మికుల పోస్టులు ఎన్ని ఖాళీలున్నాయి?

ఎంహెచ్‌ఒ: పారిశుధ్య కార్మికులు చనిపోయిన వారి స్థానంలో రెగ్యులర్ మూడు, ఔట్ సోర్సింగ్ ఐదు మొత్తం ఎనిమిది ఖాళీలున్నాయి .వాటిని త్వరలో భర్తీ చేస్తాం.

ఔట్ సోర్సింగ్ కార్మికులకు జీతం ఎంత ఇస్తున్నారు?

ఎంహెచ్‌ఒ: ఔట్ సోర్సింగ్ కార్మికులకు నెలకు? రూ.15000 జీతం, రూ.6000 హెల్త్ అలవెన్స్ కింద మొత్తం. రూ. 21000 ఇస్తున్నాం. వారికి పిఎఫ్, ఇఎస్ఐతో పాటు పోస్టల్ ఇన్సూరెన్స్ కూడా చేయించాం. వారికి ఆరోగ్య పరీక్షలు చేయించేందుకు ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యంతో మాట్లాడాం. ఆరోగ్యాలు బాగాలేనటువంటి వారికి ఉచితంగా వైద్య సేవలు అందిస్తాం.

పారిశుద్ధ కార్మికుల పై పర్యవేక్షణ కోసం ఎంతమంది సానిటరీ ఇన్‌స్పెక్టర్లున్నారు.?

ఎంహెచ్‌ఒ: ఎం. శ్రీనివాసులు మాత్రం రెగ్యులర్‌గా శానిటరీ ఇన్‌స్పెక్టర్ పనిచేస్తున్నారు. మరో 16 మంది ఇన్‌ఛార్జి సానిటరీ ఇన్‌స్పెక్టర్లున్నారు. ముగ్గురు సెక్రటరీలు , ముగ్గురు మేస్త్రీలు, పదిమంది హెల్త్ అసిస్టెంట్లు ఇంచార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్లుగా పనిచేస్తున్నారు. ఎనిమిది మంది శానిటరీ ఇన్‌స్పెక్టర్ల పోస్టులు ఖాళీలున్నాయి. హెల్త్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న వారికి ప్రమోషన్లు ఇచ్చి ఆ ఖాళీలను భర్తీ చేస్తాం.

ట్రేడ్ లైసెన్సులు, మినరల్ వాటర్‌ప్లాంట్లు ఎన్ని ఉన్నాయి?

ఎంహెచ్‌ఒ: నగరంలో 9980 ట్రేడ్ లైసెన్లు ఉన్నాయి. మినరల్ వాటర్ ప్లాంట్లు 57 ఉన్నాయి. నగరంలోని 52 వార్డులలో ఉన్న 137 సచివాలయాల్లో ఆయా వార్డులలోని సమస్యలను తెలియజేసి పరిష్కరించుకోవాలి.



వి.కృష్ణయ్యకు విరాళం ఇస్తున్న పిపిఎస్ఎస్ నాయకులు ఇ పుల్లారెడ్డి, తదితరులు

ఎఐకెఎస్‌కు పిపిఎస్ఎస్ విరాళం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఈనెల 15,16,17 తేదీలలో కర్నూలులో జరగనున్న ఎఐకెఎస్ అఖిల భారత కౌన్సిల్ సమావేశాల నిర్వహణకు పట్టణ పౌర సంక్షేమ సంఘం (పపిఎస్ఎస్) రూ 4,500 విరాళాన్ని అందజేశారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కష్ణయ్యకు పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు ఇ. పుల్లారెడ్డి, యాకోబు, నాగరాజు, రమణ గౌడు విరాళాన్ని ఇచ్చారు. ఎఐకెఎస్ సమావేశాల విజయవంతం కొరకు విరాళం ఇచ్చిన పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులకు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు.



మాట్లాడుతున్న అధ్యక్షులు , సీనియర్ జర్నలిస్టు సత్యన్న

సగరులు అన్ని రంగాల్లో ఎదగాలి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

సగరులు అన్ని రంగాల్లో ఎదగాలని, హక్కుల కోసం పోరాటం చేయాలని అతిథులు సూచించారు. కర్నూలు జిల్లా భగీరథ ఉప్పర సంఘం కార్తీక వనబోజనాలను కర్నూలు నగరం వివిఎస్ ఫంక్షన్ హాలులో ఆదివారం నిర్వహించారు. కర్నూలు జిల్లా అధ్యక్షుడు బి.సత్యన్న అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా వావిలాల కృష్ణమూర్తి, సిల్వర్ జూబ్లీ కాలేజీ ప్రొఫెసర్ పార్వతిదేవి, ఎక్సైజ్ సిఐ, మాజీ జిల్లా అధ్యక్షుడు కోడుమూరు రాముడు, ఎపి వీరన్న తదితరులు హాజరయ్యారు. జిల్లా నలుమూలల నుండి సగరులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ సగరులు అన్ని రంగాలలో ఎదగాలని, మన హక్కుల కోసం పోరాటం చేయాలని, మనం భగీరథ వారసులమని నిరూపించాలని చెప్పారు. సమావేశం అనంతరం మహిళలకు, పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

ఆటో కార్మికుల సంక్షేమానికి కృషి : హాఫీజ్ ఖాన్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

ఆటో కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి కృషి చేస్తుందని కర్నూలు ఎమ్మెల్యే ఎం.ఎ.హాఫీజ్ ఖాన్ అన్నారు. కర్నూలు మున్సిపల్ మైదానంలో ఆటో కార్మికుల సమస్యలపై అన్ని యూనియన్ల సభ్యులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్, మేయర్ బివై రామయ్య, ఆర్‌టిఒ రమేష్, మున్సిపల్ అడిషనల్ కమిషనర్ రాంలింగేశ్వర్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఎమ్మెల్యే హాఫిజ్ ఖాన్ మాట్లాడుతూ ఆటో కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం, సిఎం వైస్ జగన్మోహన్ రెడ్డి కృషి చేస్తుస్తున్నట్లు అన్నారు. ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికి తమ ప్రభుత్వం ముందుంటుందని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా పుట్టిన బిడ్డ దగ్గర నుండి ప్రజా ఆరోగ్యానికి రక్షణకు ఆరోగ్య శ్రీ ద్వారా ప్రజలకు మేలు చేస్తున్నారని అన్నారు. వాహన మిత్ర ద్వారా ఆటో కార్మికులకు రూ.10 వేలు అందించి వారికి ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని తెలిపారు. నగరంలో వివిధ ఆటో సంఘాల నాయకులు, కార్మికులు(డ్రైవర్ల) ఈ కార్యక్రమం లో గడ్డం రామకృష్ణ, షేక్షావలి, కేదార్నాథ్, పర్ల సూర్యుడు, అక్బర్ అలీ, ఫరూక్, ఇర్ఫాన్, సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు ఆటో యూనియన్ నాయకులు ప్రభాకర్, ఈశ్వర్, రాధాకృష్ణ, వల్లి, కృష్ణారెడ్డి, రాము, రవికుమార్, తిరుపాల్ కుమార్, రక్షణ ఆటో అండ్ మోటర్ వర్కర్స్ యూనియన్ సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ ఎగ్జిబిషన్

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్



ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న అధికారులు

చిన్నటేకూరు సమీపంలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల విద్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. ఈ ఎగ్జిబిషన్‌ను గురుకుల విద్యాలయ కోఆర్డినేటర్ ఐ శ్రీదేవి, కల్లూరు ఎంఇఒ శ్రీనివాసులు, ప్రిన్సిపల్ రామసుబ్బారెడ్డిలు సందర్శించి విద్యార్థుల ప్రతిభకు అభినందనలు తెలిపారు. విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలు ఇలాంటివి వాటి ద్వారా ప్రదర్శించబడతాయని పేర్కొన్నారు. గణితం సైన్స్ ఇంగ్లీషు సబ్జెక్టులకు సంబంధించిన పలు నమూనాలను ఎగ్జిబిషన్‌లో విద్యార్థులు తయారుచేసి ఉంచారు.

గురుకులంలో ఘనంగా సైన్స్ దినోత్సవం

ప్రజాశక్తి -సి బెళగల్

సి బెళగల్ మండలం గురుకుల పాఠశాలలో ప్రిన్సిపల్ బాలరాం ఆదివారం క్రీడా ఉపాధ్యాయులు, బోధన సిబ్బంది సమక్షంలో సైన్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆయా నమూనాలను తయారు చేసిన విద్యార్థుల ప్రతిభకు అభినందనలు తెలిపారు. గురుకుల పాఠశాల క్రీడా స్టేడియం నమూనా ఆకర్శించింది.



వికలాంగుల సంక్షేమాన్ని గాలికొదిలిన ప్రభుత్వం

100 కిలోమీటర్ల వికలాంగుల హక్కుల పోరుబాట ప్రారంభం



వికలాంగుల హక్కుల పోరుబాటను ప్రారంభిస్తున్న నాయకులు

ప్రజాశక్తి -కోడుమూరు : వికలాంగుల సంక్షేమాన్ని ప్రభుత్వం గాలికొదిలేసిందని సామాజిక సేవా కార్యకర్త మల్లె గ్రూపు అధినేత డాక్టర్ ఆల్‌ఫ్రైడ్ రాజు, టిడిపి కోడుమూరు ఇన్‌చార్జి ఆకెపోగు ప్రభాకర్ , వామపక్ష ప్రజాసంఘాల నాయకులు అన్నారు. ఆదివారం కోడుమూరులో జిల్లావికలాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు బి ఎల్లప్ప, జిల్లా వికలాంగుల హక్కుల పోరాట సమితి (విహెచ్ పిఎస్) అధ్యక్షుడు బిసి నాగరాజుల ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యకర్త, మల్లేల గ్రూపు అధినేత శ్రీ డాక్టర్ ఆల్ఫ్రెడ్ రాజు గారి నేతృత్వంలో 3వ రోజు '100 కిలోమీటర్ల వికలాంగుల హక్కుల పోరుబాట యాత్ర' ను ప్రారంభించారు. ఈయాత్రలో ప్రధానంగా ఈ ప్రభుత్వం వికలాంగులకు రూ.6000 పెన్షన్ పెంచాలని, వికలాంగుల బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని, వికలాంగుల 4శాతం రిజర్వేషన్ అమలు చేయాలని కోరారు. వికలాంగులకు ఇంటి స్థలాలు ఇచ్చి ఇల్లు నిర్మించి ఇవ్వాలని, వికలాంగుల హక్కులను, చట్టాలను, రాయితీ, రిజర్వేషన్లు సాధన కోసం, వికలాంగుల సమస్యలు, ఇబ్బందులు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈసమస్యల పరిష్కారానికే లాంగుల హక్కుల పోరుబాట యాత్ర అని తెలిపారు. టిడిపి ఇన్‌ఛార్జి ఆకపోగు ప్రభాకర్, కోడుమూరు సర్పంచి భాగ్య లక్ష్మి, ఎంఆర్‌పిఎస్ జిల్లా నాయకులు సుమాల ఆంధ్రయ్య, సిపిఎం మండల కార్యదర్శి గపూర్‌మియ్యా మాట్లాడుతూ వికలాంగుల హక్కులను, చట్టాలను, రాయితీ, రిజర్వేషన్లను అమలుపరచడంలో పూర్తిగా చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదన్నారు. వివిధ ప్రజా సంఘాల నేతలు, నాయకులు పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమంలో వైద్యులు, క్లస్టర్ హెడ్ మహేశ్వర్‌రెడ్డి , తదితరులు

మెడికవర్‌లో హార్ట్ ఎటాక్‌పై అవగాహన

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు మెడికోవర్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో అమెరికన్ హార్ట్ అసోసియేషన్ (ఎహెఎ) బేసిక్ లైఫ్ సపోర్ట్(బిఎల్ఎస్, అడ్వాన్స్‌డ్ కార్డియాక్ లైఫ్ సపోర్ట్ (ఎసిఎల్ఎస్) కార్యక్రమం ఆదివారం నిర్వమించారు. ఈ సందర్భంగా ఎమర్జెన్సీ డిపార్ట్‌మెంట్ విభాగపు అధిపతి డాక్టర్ టివి.సునీల్ యాదవ్ మాట్లాడుతూ గోల్డెన్ అవర్‌లో అత్యవసరపు మెళకువలు పాటించడానికి ఇలాంటి శిక్షణ తరగతులు ఎంతో ఉపయోగ పడతాయని తెలిపారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారిని ఆసుపత్రికి తరలించేలోపు కొన్ని చిన్న మెళుకువలు ద్వారా అత్యవసర స్థాయి ప్రథమ చికిత్స అందించి కాపాడవచ్చని, దీన్నే విద్య పరిభాషలో బిఎల్ఎస్ అని అంటారన్నారు. బిఎల్ఎస్ ద్వారా ఒక నిండు ప్రాణాలను కాపాడ గలరన్నారు. ప్రాణాపాయ స్థితిలో నుంచి వీలైనంత త్వరగా రక్షించి సిపిఆర్ చేయగల గాలన్నారు. ఇలా అవగాహనా సదస్సులు ఎంతో తోడ్పడు తాయని తెలిపారు. క్లస్టర్ హెడ్ డాక్టర్ వై.మహేశ్వర్ రెడ్డి, సెంటర్ హెడ్ పి. నీలా రెడ్డి, ఆపరేషనల్ హెడ్ ఇమ్రాన్, డిఎస్ అరుణ , డాక్టర్ మురళి కృష్ణ, డాక్టర్ రాఘవ పాల్గొన్నారు. రాబోయే రోజుల్లో ఇలాంటి మరెన్నో శిక్షణలు, నైపుణ్యాన్ని అందిస్తామని తెలిపారు.



టిడిపి మేనిఫెస్టోను వివరిస్తున్న గౌరుచరిత

టిడిపి తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం: గౌరుచరిత

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

టిడిపి తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని టిడిపి పాణ్యం ఇంచార్జీ మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి అన్నారు. ఆదివారం పాణ్యం నియోజకవర్గం ఓర్వకల్లు మండలం పుడిచెర్ల గ్రామంలో ఇంటింటి ప్రచారంలో భాగంగా రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ తిరిగి చంద్ర బాబు నాయుడు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల గురించి గౌరు చరిత రెడ్డి ప్రజలకు వివరించారు. మాజీ సర్పంచ్ కె.శివుడు, పి.తిరుపాల్, కె. ప్రకాశం, జి.పుల్లారెడ్డి, పాణ్యం తిరూపాల్, బంగి మహబూబ్ బాషా, ఐటిడిపి మదు శేఖర్, నంద్యాల జిల్లా అధ్యక్షులు మల్లెల రాజశేఖర్, పార్లమెంట్ ఉపాధ్యక్షుడు మోహన్ రెడ్డి, మండల అధ్యక్షుడు గోవింద్ రెడ్డి, మండల నాయకులు నన్నూరు విశ్వేశ్వరరెడ్డి, లక్ష్మీ కాంతారెడ్డి, మైనారిటీ నాయకులు ఖాజమియా, శంషుద్దీన్, సర్కార్, జాకీర్ హుస్సేన్, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

వేడెక్కుతున్న ఆదోని రాజకీయం...

- గెలుపు గుర్రాలకే టికెట్..! - నేతల్లో గుబులు

ప్రజాశక్తి - ఆదోని

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో 'గెలుపు గుర్రాలకే టికెట్లు' అంటూ టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ప్రకటన చేసిన తెలిసిందే. వైసిపిని ఎదుర్కోవాలంటే సమిష్టిగా రంగంలోకి దిగాల్సి ఉందని టిడిపి నాయకులు చెబుతున్నారు. ఎన్నికలు ముంచుకొస్తున్న టిడిపిలో వేర్వేరు కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉన్నారు. అధిష్టానం పిలిచి అభ్యర్థిని ఖరారు చేస్తే బాగుంటుందని కేడర్ చెబుతోంది. ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా టిడిపిలో నాయకుల వ్యవహారం ఉంది. నియోజకవర్గంలో వచ్చే సాధారణ అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా సమయం 5 నెలలు ఉన్నా అప్పుడే రాజకీయ వాతావరణం నెలకొంది. ఆదోనిలోని ప్రధాన పార్టీలైన వైసిపి, టిడిపి అధిష్టానాలు ఇచ్చిన పిలుపుమేరకు ఆయా పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు వివిధ కార్యక్రమాల్లో బిజీబిజీగా ఉంటున్నారు. ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డితోపాటు ఎమ్మెల్యే తనయుడు, వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జయమనోజ్ రెడ్డిలు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు 'గడపగడపకు మన ప్రభుత్వం'లో బిజీగా ఉంటున్నారు. గ్రామాల్లో ఎమ్మెల్యే, పట్టణంలోని ఆయా వార్డుల్లో ఎమ్మెల్యే తనయుడు జయమనోజ్ రెడ్డి పాల్గొంటున్నారు. ప్రతి గడపను తట్టి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రజలకు మరింత దగ్గరవుతున్నారు. తమదైన శైలిలో ప్రజలను ఆకట్టుకుంటూ ఇంకా ఏమైనా సమస్యలుంటే వెంటనే పరిష్కారానికి అధికారులను ఆదేశిస్తున్నారు. పనులు చేస్తూ వచ్చే ఎన్నికల్లో జగన్మోహన్‌రెడ్డిని మరవకూడదని, ఫ్యాన్ కింద పల్లగా ఉండాలని ప్రజలను కోరుతున్నారు. అలాగే వ్యక్తిగతంగా ఉన్న సమస్యలను సైతం పరిష్కరించేందుకు దృష్టి పెడుతున్నారు. ఎన్నికల కోసం పార్టీ కేడర్‌ను, నాయకులను సిద్ధం చేస్తూ ప్రజలను ఎన్నికల వైపునకు మళ్లిస్తూ అందరూ ఉండాలంటూ కోరుతున్నారు. 'గడపగడపకు మన ప్రభుత్వం'లో అక్కడక్కడ నిరసనలు ఎదురవుతున్నా వాటిని ఎదుర్కొంటూనే ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి, తనయుడు మనోజ్ కుమార్ రెడ్డి ముందుకు వెళ్తున్నారు. అలాగే మున్సిపల్ ఛైర్మన్ బోయ శాంత, వైస్ ఛైర్మన్లు నరసింహులు, ఎం.ఎం.జి.గౌస్‌తో పాటు వైసిపి పట్టణ అధ్యక్షులు దేవా, పట్టణ కన్వీనర్ల చెల్లా మధుసూదన్ శర్మ, ఫయాజ్ అహ్మద్‌లు ఇతర పార్టీ కేడర్ పట్టణంలోని ఆయా వార్డుల్లో 'ఏపికి జగనే ఎందుకు కావాలి', ఆయా వార్డుల్లో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను 'ఫ్లెక్సీల' ఏర్పాటు చేస్తూ, వైసిపి జెండాలను ఎగురవేస్తూ సమావేశాలు, సభలు నిర్వహిస్తున్నారు.

మరోపక్క మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు, ఆయన సోదరుడు, టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు నాయకత్వంలో పలు కార్యక్రమాలను చేపడుతున్నారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద పెద్దఎత్తున 29 రోజుల పాటు నిరాహార దీక్షలు చేపట్టారు. ప్రస్తుతం ఇంటింటికీ వెళ్లి బాబు అక్రమ అరెస్టుపై ప్రజలకు వివరిస్తున్నారు. అలాగే చంద్రబాబు నాయుడును అరెస్టు చేసిన నాటి నుంచి గతనెల రోజులుగా పట్టణంలో మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు నాయకత్వంలో వివిధ రూపాల్లో ఆందోళన చేపట్టి పార్టీ కార్యకర్తల్లో, నాయకుల్లో జోష్ నింపారు. చంద్రబాబు నాయుడు అరెస్టు తర్వాత చేపట్టిన కార్యక్రమాలతో ఆదోని టిడిపిలో కొత్త ఉత్తేజం నెలకొంది. పట్టణంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి రిలే నిరాహార దీక్షలో పాల్గొన్నారు. రోజూ వందల సంఖ్యలో దీక్షలో హాజరు కావడంతో టిడిపికి చంద్రబాబు అరెస్టు కొత్త జోష్ నింపినట్లు అయింది. 'సైకో జగన్‌ను ఇంటికి పంపాలి. చంద్రబాబు నాయుడును అధికారంలోకి తీసుకురావాలి' అని కోరుతున్నారు. అలాగే ఆయా గ్రామాల్లో పట్టణంలోని ఆయా వార్డుల్లో 'బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ' కూడా మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు చేపడుతున్నారు. అలాగే మరోపక్క టిడిపి మాజీ ఇన్‌ఛార్జీ ఆది కృష్ణమ్మ సైతం తనదైన శైలిలో ఇంటింటికీ వెళ్తూ చంద్రబాబు అరెస్టు వివరాలను, ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ ముందుకు వెళ్తున్నారు. కృష్ణమ్మ తమ ప్రత్యేకతను చాటుకుంటూ 'బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ'ని విస్తృతంగా నిర్వహిస్తున్నారు. ప్రత్యేకంగా తనదైన శైలిలో తయారు చేసిన బాబు ఆరు గ్యారెంటీలపై ఇంటింటికీ కరపత్రాలను అందిస్తూ ముందుకు వెళ్తున్నారు. టిడిపిలో తటస్తంగా ఉన్న నాయకుల ఇళ్లకు వెళ్లి బాబును ముఖ్యమంత్రి చేసేందుకు అందరూ కలిసికట్టుగా రావాలని, పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనాలని, టిక్కెట్టు ఎవరికి వచ్చినా గెలిపించుకోవడమే అందరి లక్ష్యం కావాలని కోరుతున్నారు. అలాగే టిడిపిలో మరో గ్రూపుగా కొనసాగుతున్న మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ సూరం భాస్కర్ రెడ్డి, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు మాన్వి దేవేంద్రప్ప, పెద్ద మసీదు కమిటీ ఛైర్మన్ సౌదీ రావుఫ్, ఫక్రుద్దీన్, మాజీ కౌన్సిలర్ రామచంద్ర, మరికొంతమంది కలిసి మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా 17 రోజులపాటు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. దీక్షల శిబిరం కొనసాగించి వినూత్న కార్యక్రమం చేపట్టి, పోలీసు కేసులు, అక్రమ అరెస్టుకు గుర్తై కేసు నమోదు కావడంతో నాయకులు మరో విధంగా నిరసనలు తెలిపి హైలెట్‌గా నిలిచారు. ప్రస్తుతం ఈ గ్రూపు పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండడంపై ప్రజలు చర్చించుకుంటున్నారు. అధిష్టానం ఆదేశం వచ్చే వరకు తాము కార్యక్రమాలు ప్రత్యేకంగా చేపట్టమని పేర్కొంటున్నట్లు తెలిసింది. అలాగే జనసేన నాయకులు సైతం పార్టీ ఇన్‌ఛార్జ్ మల్లప్ప ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు చేస్తూ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ నాయకులు, కార్యకర్తలను ఉత్తేజపరుస్తున్నారు. ఆదోనిలో ప్రతిపక్షంగా ఉంటూ అధికార పార్టీపై విమర్శలు చేస్తూ జనసేన నాయకులు ముందుకెళ్తున్నారు. తమ వంతుగా రోడ్ల మరమ్మతులు, శ్రమదానం చేపడుతూ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతున్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీలోని రెండు గ్రూపులు, బిజెపిలోనూ ఉన్న నాయకులు తమదైన శైలిలో కార్యక్రమాలు చేపడుతూ ముందుకు సాగుతున్నారు. బిజెపి నాయకులు ప్రత్యేకంగా 'సంకల్పయాత్ర' చేపడుతూ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తున్నారు. అలాగే వామపక్ష నాయకులు సైతం ప్రభుత్వ ప్రజా వ్యతిరేక కార్యక్రమాలపై నిరసనలు తెలుపుతూ ముందుకు వెళ్తున్నారు. చంద్రబాబు అరెస్టుకు నిరసనగా నియోజకవర్గంలో టిడిపి నాయకులు చేపట్టిన కార్యక్రమాలతో, ఇటు అధికార వైసిపి నాయకులు 'గడపగడపకు మన ప్రభుత్వం'తోను పట్టణంలోని వివిధ వార్డుల్లో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, భూమిపూజ, కొత్తగా నిర్మించిన ఆస్పత్రి భవనాలను, కెడిసిసి బ్యాంకు భవనాన్ని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి ప్రారంభించడం వంటి పనులతో నియోజకవర్గం రాజకీయం వేడెక్కింది. టిడిపి, జనసేన పార్టీ మధ్య పొత్తు ఉండడం, అందులోనూ కర్నూలు జిల్లాలో అంతో ఎంతో ఆదోనిలో జనసేన పార్టీ బలంగా ఉండడం, గత ఎన్నికల్లో జనసేన పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన మల్లప్పకు 12 వేల దాకా ఓట్లు రావడంపై కచ్చితంగా జనసేన పార్టీకే పొత్తుల్లో భాగంగా టికెట్ వస్తుందని ఆ పార్టీ నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. జనసేన పార్టీకి ఉత్తర కోస్తా, కోస్తాంధ్రలో మాత్రమే పొత్తులో భాగంగా టికెట్లు వస్తాయని, రాయలసీమలో టికెట్లు ఇవ్వడం కష్టంగా ఉందని, తమ పార్టీ అభ్యర్థి విజయం సాధించడం ఖాయమని మరోపక్క టిడిపి నాయకులు, కార్యకర్తలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. అలాగే అధికార పార్టీ సైతం ఆదోనిలో కొత్త వ్యక్తులను బరిలో దింపాలని, పికె టీం ద్వారా పట్టణంలోని ప్రముఖులను కలుస్తూ వారి వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం. ఇటీవల పికె టీం ఆదోనిలో అనేకమంది కొత్త నాయకులను, అలాగే జనసేన, టిడిపిలో ఉన్న నాయకులను సైతం కలిసి వైసిపిలోకి ఆహ్వానించినట్లు సమాచారం. మరోపక్క బీసీవై పార్టీ జాతీయ అధ్యక్షులు రామచంద్ర యాదవ్ సైతం ఇటీవల ఆదోనిలో పర్యటించి పార్టీని బలోపేతం చేసేందుకు ముఖ్య నాయకులను కలిసి వెళ్లినట్లు సమాచారం. స్థానిక ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డిపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేసి, ప్రత్యేక ఆకర్షణగా బీసీవై పార్టీ జాతీయ అధ్యక్షులు రామచంద్ర యాదవ్ నిలిచారు. అప్పుడే ఎన్నికల వాతారణం ఏర్పడింది. వచ్చే అసెంబ్లీ ఎన్నికల బరిలో ఎవరుంటారనే విషయంపై పట్టణంలో విస్తృతంగా చర్చ సాగుతోంది.





సదస్సులో మాట్లాడుతున్న నారాయణస్వామి

బహిరంగ సభను జయప్రదం చేయండి

- సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి నారాయణ స్వామి

ప్రజాశక్తి-ఆలూరు

ఈనెల కర్నూలులో 15, 16, 17న జరిగే ఏపి రైతు సంఘం (ఎఐకెఎస్) జాతీయ కౌన్సిలింగ్ సమావేశాల సందర్భంగా 15న జరిగే భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కెరి.నారాయణ స్వామి కోరారు. ఆదివారం ఆలూరులోని జ్యోతిబసు భవనంలో సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు రైతు సంఘం మండల కార్యదర్శి ఈరన్న అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నారాయణస్వామి మాట్లాడారు. కర్నూలులో ఈనెల 15న నిర్వహించే ఎఐకెఎస్ భారీ ప్రదర్శనను, బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. కేంద్రంలో నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కార్మికులు, కర్షకులు, రైతులు, రైతు కూలీల హక్కులను హరించడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తూ కార్పొరేట్ శక్తులకు అనుకూలమైన చట్టాలను చేస్తూ ప్రజాపై విపరీతమైన భారాలు వేస్తున్నారని మండిపడ్డారు. రైతు సుదీర్ఘ పోరాటంలో ఎందరో ప్రాణ త్యాగాలను చేశారని, మొక్కవోని పట్టుదలతో నరేంద్ర మోడీ మెడలు వంచి రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేసే విధంగా పోరాటం చేసిన మహా పోరాట యోధులు కర్నూలుకు రానున్నారని తెలిపారు. మరో రైతు పోరాటానికి రూపకల్పన చేసేందుకు కర్నూలు నగరంలో అఖిల భారత రైతు కౌన్సిల్ సమావేశాలు, భారీ ప్రదర్శన బహిరంగసభ నిర్వహిస్తున్నామని చెప్పారు. రైతుసంఘం హోళగుంద మండల నాయకులు వెంకటేశ్వర్లు, సిఐటియు హాలహర్వి మండల నాయకులు కృష్ణ, సిఐటియు నాయకులు నాగరాజు, వీరేష్, నాగరాజు, విఠల్, డివైఎఫ్ఐ నాయకులు మైనా, ఎస్ఎఫ్ఐ నాయకులు గిరిమూర్తి, జగదీష్ పాల్గొన్నారు.

ధ్వజ స్తంభానికి ఆర్థిక సాయం

- మంత్రి గుమ్మనూరు జయరామ్

ప్రజాశక్తి - హాలహర్వి

శ్రీరామ దేవాలయ ధ్వజస్తంభానికి ఆర్థిక సహాయం అందజేస్తామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్



మంత్రి జయరామ్‌ను కలిసిన గ్రామస్తులు

తెలిపారు. మంత్రి జయరామ్‌ను బాపురం సర్పంచి నాగేంద్ర, శ్రీరామ దేవాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఆదివారం కలిశారు. ధ్వజ స్తంభం గురించి మంత్రి గుమ్మనూరు జయరామ్‌కు వివరించారు. మంత్రి స్పందించి... ధ్వజ స్తంభానికి రూ.25 వేలు సహాయంగా అందిస్తానని చెప్పారు. సూగనగౌడ్, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు సదానంద, వీరభద్రప్ప, కరి బసప్ప, రాఘవేంద్ర, మారేష్, పార్తన్న, శివరాం పాల్గొన్నారు.

దర్గాను సందర్శించిన ఢిల్లీ పీఠాధిపతి

ప్రజాశక్తి - కౌతాళం

ఢిల్లీ ఖాజా నిజాముద్దీన్ ఔలియా పీఠాధిపతి సయ్యద్ ఖాజా మొహమ్మద్ శ్రీజగద్గురు ఖాదర్ లింగ స్వామి దర్గాను ఆదివారం సందర్శించారు. ఖాదర్ లింగ స్వామి పీఠాధిపతి సయ్యద్ ఖాదర్ బాషా, ధర్మకర్త సయ్యద్ మున్నా పాషా సాహెబ్ ఆధ్వర్యంలో దర్గాలో ప్రత్యేక ఫాతేహాలు నిర్వహించారు. ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో, కులమతాలకు అతీతంగా ప్రార్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కౌతాళం ఖాదర్ లింగ స్వామి సన్నిధిలో ప్రతి ఒక్కరూ పాల్గొనడం చాలా ఆనందదాయకమని తెలిపారు. అనంతరం నూతనంగా నిర్మించిన మస్జిద్-ఎ-ఖాదీర్ చూసి వారు ప్రత్యేక గ్రంథం కురాన్‌ను అందించారు. స్వామి వారి భక్తులు, మురీదులు, ఆయా మసీదుల పెద్దలు పాల్గొన్నారు.



గ్రంథాన్ని అందిస్తున్న పీఠాధిపతి

స్వేచ్ఛగా జీవించే హక్కే.. మానవ హక్కు

- జూనియర్ సివిల్ జడ్జి గురు అరవింద్
- ఘనంగా మానవ హక్కుల దినోత్సవం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ప్రతి ఒక్కరికీ స్వేచ్ఛ, వాక్ స్వాతంత్ర్యం, సమాజంలో జీవించే హక్కులే మానవ హక్కులని జూనియర్ సివిల్ జడ్జి గురు అరవింద్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని ఆర్‌టిసి బస్టాండ్ వద్ద గల ఆర్ఎంకె కోచింగ్ సెంటర్‌లో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు జూనియర్ సివిల్ జడ్జి గురు అరవింద్ పలు సూచనలు చేశారు. పుట్టినప్పటి నుంచి మరణించే వరకు ప్రతి వ్యక్తికీ ఉండే ప్రాథమిక హక్కులను మానవ హక్కులు అంటారని తెలిపారు. ప్రతి మానవుడు వారి కులం, మతం, జాతీయత, రంగు, లింగం, మతం, విశ్వాసాలు లేదా సామాజిక హోదాతో సంబంధం లేకుండా ఈ హక్కులకు అర్హులని చెప్పారు. జూనియర్ కళాశాల ఇన్‌ఛార్జీ ప్రిన్సిపల్ రుక్మన్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు వెంకటేశ్వరరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ తిమ్మప్ప, కోచింగ్ నిర్వాహకులు ఆశలుక్మాన్, అఫ్రోజ్, న్యాయవాదులు మురళీకృష్ణ, విమల, దామోదర్ రెడ్డి, లింగమూర్తి, ఏసేబు, రామమూర్తి, మహేశ్వరి, ఎఎస్ఐ విజయరాజు, బోధకుడు స్వామినాయక్, బద్రి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి గురు అరవింద్

50 ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు

- గురువులు మించిన దైవం లేదన్న విశ్రాంత ఐఎఎస్ అధికారి రామాంజినేయులు

ప్రజాశక్తి-ఆలూరు

ఆలూరు ప్రభుత్వ బాలుర-2 ఉన్నత పాఠశాలలో 1972-73లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 50 ఏళ్ల తర్వాత కలుసుకున్న వారు అలనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. విద్యాబుద్ధులు చెప్పిన అలనాటి గురువులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గురువులు ఎస్తేరమ్మ, వీరభద్ర గౌడ్ మాట్లాడారు. తమ విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరి పాఠశాలకు, గురువులకు మంచి పేరు తీసుకొచ్చారని ఆనందం వ్యక్తం చేశారు. ఇన్ని రోజుల తర్వాత తమను గుర్తు పెట్టుకొని కార్యక్రమానికి ఆహ్వానించి సన్మానించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. గురువులకు ఇంతకన్నా ఆనందం ఏముంటుందన్నారు. పూర్వపు విద్యార్థి, విశ్రాంత ఐఎఎస్ అధికారి బి.రామాంజనేయులు మాట్లాడుతూ... గురువులను మించిన దైవం లేదని, ఆరోజు విద్యాబుద్ధులు నేర్పడం వల్లే తామంతా ఈ స్థాయిలో ఉన్నామని తెలిపారు. ఈ గొప్పతనం పాఠాలు చెప్పిన గురువులకే దక్కుతుందన్నారు. అనంతరం అందరూ కలిసి యోగ క్షేమాలు, కుటుంబ స్థితి గతులపై చర్చించుకున్నారు. మృతి చెందిన మిత్రులకు సంతాపం ప్రకటించారు. విశ్రాంత ఎస్ఐ బాష, ఆర్అండ్‌బి విశ్రాంత ఎస్ఇ సుబ్బారావు, సెంట్రల్ బ్యాంక్ విశ్రాంత చీఫ్ మేనేజర్ రామ్మోహన్ రావు, టిడిపి రాష్ట్ర నాయకులు సి.నారాయణరెడ్డి, అమీర్, ఎన్ఆర్ఐ మురళీ కృష్ణ (శశి), సుందర్ పాల్గొన్నారు.



గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు



ఒహెచ్ఎస్ఆర్ ట్యాంకు పైపు నుంచి వృథా అవుతున్న తాగునీరు

పైపు లీకేజీతో తాగు నీరు వృథా

- అధికారుల నిర్లక్ష్య వైఖరి : సిపిఐ

ప్రజాశక్తి-ఆలూరు

ఆలూరులో ఆర్‌డబ్ల్యుఎస్ కార్యాలయ ఆవరణలో ఉన్న ఒహెచ్ఎస్ఆర్ ట్యాంకు పైపు లీకేజీ అయి తాగునీరు వృథాగా పోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని సిపిఐ మండల కార్యదర్శి రామాంజనేయులు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడారు. ఆలూరులోని ఎన్‌జిఒస్ కాలనీ, కోయ నగర్, సిద్ధేశ్వర కాలనీల్లో తాగునీరు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పైపు లీకేజీలతో పట్టణంలో ఎక్కడపడితే అక్కడ నీరు వృథాగా పోతున్నా అధికారుల నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా పాత పైపులను తీసి కొత్తగా వేసి ప్రజలకు తాగునీటిని సక్రమంగా అందించాలని కోరారు.

దేవరగట్టులో భక్తుల పూజలు

ప్రజాశక్తి - హోళగుంద

దేవరగట్టులో భక్తులు పూజలు నిర్వహించారు. ఆదివారం సందర్భంగా ఆలూరు నియోజకవర్గం భక్తులే కాకుండా కర్ణాటక నుంచి కూడా అధిక సంఖ్యలో తరలివచ్చి శ్రీమాల మల్లేశ్వరులను దర్శించుకున్నారు. ఉదయం 6 గంటల నుంచి భక్తులు బారులు తీరారు. అర్చకులు మల్లయ్య, మహేష్ స్వాములు మాల మల్లేశ్వరులకు అభిషేకం చేసి బండారు అర్చన, బిల్వార్చన, కుంకుమార్చన చేశారు. దర్శన నిమిత్తం వచ్చిన భక్తులకు దేవరగట్టు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉచిత అన్నదానం ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా హోళగుంద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

నీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోండి

- ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు

ప్రజాశక్తి- దేవనకొండ

తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులు ఆదేశించారు. దేవనకొండలోని పాత మార్కెట్ సమీపంలో ఉన్న వడ్డేగేరి, ఎర్రగోటి వీధుల్లో కుళాయిలకు సరఫరా అయ్యే మంచినీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదివారం ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ నాగేశ్వరరావు, ఎఇ మురళీమోహన్ పంచాయతీ సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పైపులైన్ లీకేజీలకు మరమ్మతు చర్యలు చేపట్టాలన్నారు. ఆయా కాలనీల్లో అతిసారకు గురైన రోగులను పరామర్శించి జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. జడ్‌పిటిసి కిట్టు, ఇఒఆర్‌డి సూర్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి అబ్దుల్ రహీం పాల్గొన్నారు.



అతిసార రోగులను పరామర్శిస్తున్న అధికారులు

ఉపాధ్యాయ సమస్యలపై ఉద్యమం

- ఎస్‌టియు రాష్ట్ర, జిల్లా కమిటీల్లో ఆదోని నేతలకు చోటు

ప్రజాశక్తి - ఆదోని

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని ఎస్‌టియు రాష్ట్ర కౌన్సిలర్ మహదేవప్ప, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి సుంకన్న తెలిపారు. ఆదివారం కర్నూలులోని ఎస్‌టియు భవనంలో జరిగిన జిల్లా వార్షిక కార్యవర్గ సమావేశంలో ఆదోని డివిజన్‌లోని నలుగురికి రాష్ట్ర, జిల్లా కమిటీల్లో అవకాశం కల్పించారు. నూతనంగా ఎన్నికైన వారు మాట్లాడుతూ... పాదయాత్రలో జగన్మోహన్ రెడ్డి సిపిఎస్ రద్దు చేస్తామని హామీ ఇచ్చి ఉద్యోగ, ఉపాధ్యాయులను మోసం చేశారని విమర్శించారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని హెచ్చరించారు. జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శిగా సుంకన్న, జిల్లా ఆర్థిక కమిటీ సభ్యులుగా రామాంజనేయులు, రాష్ట్ర కౌన్సిలర్‌గా మహదేవప్ప, జిల్లా కార్యదర్శిగా గోపాల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరి ఎన్నిక పట్ల ఎస్‌టియు మండల నాయకులు సుధాకర్ బాబు, షేక్షావలీ హర్షం వ్యక్తం చేశారు.



రాఘవేంద్రుని సన్నిధిలో...

సినీ నటుడు సాయికిరణ్

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయం లో కొలువైన శ్రీరాఘవేంద్ర స్వామిని సినీ నటుడు సాయికిరణ్ ఆదివారం దర్శించుకున్నారు. దర్శనార్థం ఆలయం చేరుకున్న ఆయనకు శ్రీమఠం ఆధ్యాత్మిక అభివృద్ధి కార్యాలయ సిబ్బంది జయతీర్థ స్వామి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రుని మూల బృందావనాన్ని దర్శించుకుని మంగళ హారతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 'నువ్వే కావాలి' సినిమాలో సహాయ నటుడిగా, 'అనగనగా ఆకాశం ఉంది. ఆకాశంలో మేఘం ఉంది' అనే పాట ద్వారా గుర్తింపు వచ్చిందని తెలిపారు. 'ప్రేమించు' చిత్రం ద్వారా నటుడిగా మంచి పేరు వచ్చిందని పేర్కొన్నారు. రాఘవేంద్రస్వామి, షిరిడి సాయిబాబా అంటే భక్తి అని తెలిపారు. 16 ఏళ్ల క్రితం మంత్రాలయం వచ్చానని, నాటికి నేటికి అభివృద్ధితో రూపురేఖలు మారినట్లు చెప్పారు.



ఆలయంలో ఉన్న సాయికిరణ్

పౌరుల రక్షణకే హక్కులు

- ఆర్ట్స్ కళాశాల ఇన్‌ఛార్జీ ప్రిన్సిపల్ బాలస్వామి

ప్రజాశక్తి - ఆదోని

ప్రతి ఒక్కరికీ సహజసిద్ధమైన గౌరవం, సమాన హక్కులు రాజ్యాంగం ద్వారా సంక్రమించాయని ఇన్‌ఛార్జీ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.బాలస్వామి తెలిపారు. ఆదివారం ఆదోనిలోని ఆర్ట్స్ కళాశాలలో రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో మానవ హక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జాతి, కుల, మత, వర్ణ, లింగ, రాజకీయ వివక్షకు గురవ్వకుండా వ్యక్తుల రక్షణ కోసం మానవ హక్కులు కల్పించినట్లు తెలిపారు. ఇందులో చిత్రహింస, క్రూరత్వం, వెట్టిచాకిరి, బానిసత్వం నుంచి రక్షణ పొందే హక్కులుంటాయని చెప్పారు. ఏ వ్యక్తి విషయంలోనైనా ఈ అంశాలకు భంగం కలిగితే బాధితులు మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించవచ్చని తెలిపారు. డాక్టర్ ఎం.అయ్యప్ప, డాక్టర్ హెచ్.ఎం.ఎర్రిస్వామి, జి.గోపాల్ రెడ్డి, ఎస్.విరుపాక్షప్ప పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బాలస్వామి

రాఘవేంద్రుని సన్నిధిలో ద్వాదశి పూజలు

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన శ్రీరాఘవేంద్రస్వామి మఠంలో ద్వాదశి పూజలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం ద్వాదశి తిథి సందర్భంగా తెల్లవారుజామునే పూజారులు రాఘవేంద్రుని మూల బృందావనాన్ని నిర్మాల్యం చేసి, బృందావనానికి పంచామృతాభిషేకం, అభిషేకం, తులసి అర్చన వంటి పూజలతో మంగళ హారతులు ఇచ్చారు. అనంతరం బృందావనాన్ని స్వర్ణకవచాలతో, పట్టు వస్త్రాలతో, వివిధ పుష్ప హారాలతో అందంగా అలంకరించారు. అనంతరం నైవేద్య సమర్పణతో మంగళ హారతులు ఇచ్చారు. స్వర్ణమయమైన రాఘవేంద్రుని బృందావనాన్ని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు.

సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి

- సిఐ, ఎస్ఐలు వారానికి రెండు గ్రామాలు సందర్శించాలి
- ఎమ్మిగనూరు డీఎస్పీ సీతారామయ్య

ప్రజాశక్తి - గోనెగండ్ల

ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని ఎమ్మిగనూరు పోలీసు సబ్ డివిజన్ డీఎస్పీ సీతారామయ్య తెలిపారు. ఆదివారం గోనెగండ్ల పోలీసు స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సాధారణ తనిఖీలో భాగంగా గోనెగండ్ల పోలీసు స్టేషన్‌ను సందర్శించి రికార్డులు పరిశీలించామని తెలిపారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో సబ్ డివిజన్‌లోని ప్రతి పోలీసు స్టేషన్ పరిధిలోనూ వారానికి రెండు గ్రామాలను తాను సందర్శిస్తానని చెప్పారు. అలాగే సిఐ, ఎస్ఐలు కూడా వారి పరిధిలో వారానికి రెండు గ్రామాలను తప్పనిసరిగా సందర్శించాలని ఆదేశించారు. గోనెగండ్ల మండలంలో ప్రధానంగా భూ సమస్యల ఆధారంగా కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయని తెలిపారు. దీనిని నివారించడానికి తొందరపడి అనవసరంగా గొడవలకు దిగకుండా గ్రామ పెద్దలను, రెవెన్యూ సంబంధిత అధికారులను సంప్రదించి సమస్యలను శాశ్వతంగా పరిష్కరించుకోవాలని సూచించారు. ఫ్యాక్షన్ గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. ఫ్యాక్షన్ గ్రామమైన కున్నూరును మూడుసార్లు ఇప్పటివరకు తాను సందర్శించానని చెప్పారు. అక్కడి రెండు వర్గాలను కూర్చోబెట్టి వారి సమస్యలను తెలుసుకొని ఎస్ఐ ద్వారా పరిష్కారానికి కృషి చేశానని తెలిపారు. సబ్ డివిజన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో ప్రజలు ఎలాంటి సమస్యలు ఉన్నా గొడవలకు పోకుండా సంబంధిత పోలీసు అధికారులను సంప్రదించాలని కోరారు. ఎమ్మిగనూరు రూరల్ సిఐ మోహన్ రెడ్డి, గోనెగండ్ల ఎస్ఐ తిమ్మారెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ సీతారామయ్య

ఆనేగొందిలో వైభవంగా శ్రీపద్మనాభ తీర్థుల ఆరాధన

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో కొలువైన శ్రీరాఘవేంద్రస్వామి గురుపరంపరలో వచ్చిన శ్రీపద్మనాభ తీర్థుల ఆరాధనను పీఠాధిపతులు శ్రీసుబుధేంద్రతీర్థులు వైభవంగా నిర్వహించారు. ఆదివారం కర్ణాటక రాష్ట్రం ఆనేగొంది (నవ బృందావన గడ్డ)లో బృందావనస్థులైన శ్రీపద్మనాభ తీర్థుల ఆరాధన మహోత్సవం (పూర్వారాధన) సందర్భంగా పీఠాధిపతులు శ్రీసుబుధేంద్రతీర్థులు ఆయన బృందావనాన్ని సందర్శించి, నిర్మాల్య విసర్జన చేసి, పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం బృందావనాన్ని వెండి కవచాలతో, పుష్ప హారాలతో అలంకరించారు. రాఘవేంద్రస్వామి ఆరాధ్య దైవమైన మూలరాముల విగ్రహానికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం పద్మనాభ తీర్థుల బృందావనాన్ని దర్శించుకుని మంగళ హారతులు ఇచ్చారు. భక్తులకు భోజన సదుపాయం కల్పించారు.



పూజలు నిర్వహిస్తున్న పీఠాధిపతులు



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి టి రమేష్ కుమార్

అందని 'కంది'

- రేషన్ లబ్ధిదారులకు నిరాశ
- బహిరంగ మార్కెట్‌లో ధరాఘాతం



ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

తెల్ల రేషన్ కార్డుదారులకు అందించే రేషన్‌తో పాటు ఇవ్వాల్సిన కందిపప్పు అందడం లేదు. నాలుగు నెలలుగా కందిపప్పు అందకపోవడంతో లబ్ధిదారులకు నిరాశే మిగులుతోంది. బహిరంగ మార్కెట్‌లో ధర అధికంగా ఉండటంతో సామాన్యులకు ధరాఘాతం తప్పడం లేదు...

ఉమ్మడి కర్నూలు జిల్లాలో రేషన్ కార్డుదారులకు కందిపప్పు సరఫరా అంతంత మాత్రంగానే ఉంది. నిత్యావసర సరకుల ధరలు కొండెక్కి కూర్చోవ డంతో రేషన్ సరకుల్లో బియ్యంతో పాటు కంది పప్పు ఇస్తామని పాలకులు గత ఆరేడు నెలలుగా చెబుతూనే ఉన్నారు. కార్డుదారులు ప్రతి నెలా ఆశగా ఎదురు చూస్తూనే ఉన్నారు. వారికి నిత్యం నిరాశే ఎదురవుతోంది. ఈ నెలలోనూ పూర్తిస్థాయిలో కోటా రాకపోవడంతో కొందరికి మాత్రమే అందే పరిస్థితి నెలకొంది. నవంబరు నెలలో కర్నూలు జిల్లాకు 400 టన్నులు, నంద్యాల జిల్లాకు 350 టన్నుల కంది పప్పును రెండు విడతల్లో సరఫరా చేస్తామని పౌర సరఫరాల ఉన్నతాధికారులు తెలిపారు. అక్టోబరు చివరి నాటికి, నవం బరు మొదటి వారంలో కలిపి ఉమ్మడి జిల్లాలకు 750 టన్నుల కంది పప్పు అంటే ఒక్కో కార్డుదారుడికి కిలో చొప్పున 7.50 లక్షల మందికి అందించాల్సి ఉంది. ఉమ్మడి జిల్లాలో 12.10 లక్షల మంది కార్డుదారులు ఉండగా కేవలం 24,667 మందికి మాత్రమే పంపిణీ చేయడం గమనార్హం. బహిరంగ మార్కెట్‌లో కందిపప్పు కిలో రూ.180 వరకు చేరింది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం నాఫెడ్ నుంచి రాష్ట్ర ప్రభుత్వా నికి కందిపప్పును కేటాయించడం లేదనే విమర్శ లున్నాయి. ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం కార్డుదారులకు కందిపప్పు అందించలేని పరిస్థితి నెలకొంది. ఫలితంగా పేదలు ఇబ్బందులు పడుతున్నారు. అయినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. కార్డుదారులకు గత ఐదారు నెలలుగా కంది పప్పు అందడం లేదు. ఈ నేపథ్యంలో కంది పప్పు లేకుండా ఎండీయూ వాహనాన్ని తమ వీధికి తీసుకురావొద్దంటూ కార్డుదారులు ఆపరేటర్లపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బహిరంగ మార్కెట్లో కిలో కందిపప్పు రూ.160-180 వరకు ఉంది. ఇంటింటికి రేషన్ పంపిణీలో భాగంగా ప్రభుత్వం కిలో రూ.67కే అందించాల్సి ఉం ది. బహిరంగ మార్కెట్లో ధరలు పెరిగినప్పుడు పేదలకు కందిపప్పు పంపిణీ చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నప్పటికీ ఏమాత్రం పట్టించు కోవడం లేదు. దీనిపై లబ్ధిదారుల నుండి తీవ్ర ఆగ్రహం వ్యక్తం అవుతోంది.

ఐదు నెలలుగా కందిపప్పు లేదు

రేషన్ సరుకులతో పాటు ఇచ్చే కందిపప్పు ఐదు నెలలుగా ఇవ్వడం లేదు. రేషన్‌తో పాటు ఇచ్చే దాన్ని వాడే వాళ్ళం బయట రూ.160 పెట్టి కొనుక్కోవాల్సి వస్తోంది. ప్రభుత్వం రేషన్‌తో పాటు కందిపప్పు అందిస్తే బాగుంటుంది.

- కల్పన, నంద్యాల.

అప్రజాస్వామిక విధానాలను వ్యతిరేకించండి : సిపిఎం

ప్రజాశక్తి - ఆత్మకూర్

కోటీశ్వరులకు ఊడిగం చేస్తూ పేద, మధ్యతరగతి ప్రజానీకంతోపాటు వ్యాపార వర్గాలను సైతం సమస్యలతో ముంచేత్తుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాల అప్రజాస్వామిక విధానాలకు వ్యతిరేకంగా పోరాటమే ఆయుధంగా ప్రజలు ఉద్యమించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి టి. రమేష్ కుమార్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఏసురత్నంలు అన్నారు. ఆదివారం పట్టణంలో ని సుదర్శన వర్మ భవన్ నందు సిపిఎం పట్టణ కమిటీ సమావేశం పట్టణ నాయకులు డి. రామ్ నాయక్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భ ంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబి స్తూ కార్పొరేట్లకు అనుకూలంగా వ్యవహరిస్తుందని, ప్రజల నుంచి వ్యతిరేకత రాకుండా ప్రజలను మతం పేరుతో చీల్చే ప్రయత్నం చేస్తోందన్నారు. బిజెపిని గెలిపిస్తే దేశవ్యాప్తంగా పేదరికం నిర్మూలిస్తామని నిరుద్యోగాన్ని రూపుమాపుతామని మహిళలపై హత్యాచారాలు, హత్యలు జరగకుండా చూస్తామని గొప్పలు చెప్పిన మోడీ అధికారంలోకి వచ్చిన ఎనిమిది సంవత్సరాల కాలంలో దేశంలో మహిళలపైన హత్యలు హత్యాచా రాలు నిరుద్యోగం, మత ఘర్షణలు ప్రజల పైన పన్నుల భాగాలు విపరీతంగా పెంచిందన్నారు. ఏమైనా తగ్గాయా అంటే రైతులు పండించిన పంటకు గిట్టు బాటు ధరలుధరలు మాత్రం తగ్గాయని రైతుల దివాలా తీసే విధంగా కేంద్ర ప్రభుత్వ విధానాలు ఉన్నాయని అన్నారు. కేంద్రం ఏం పని చేసిన అన్ని సమర్థిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై విపరీతంగా పన్నుల భారం జరుగు తుందని రాష్ట్రంలో నవరత్నాలు తప్ప మరో రత్నం రాష్ట్ర ప్రభుత్వానికి కనబ డటం లేదన్నారు. అభివృద్ధి శూన్యంగా ఉందన్నారు. కావున సిపిఎం ఆధ్వర్యం లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రజల పైన వేస్తున్న ఆర్థిక భారాలకు వ్యతిరేకంగా, కార్మిక హక్కులను, కర్షక హక్కుల కోసం, ప్రజలందరికీ మెరుగైన విద్య, వైద్యం, మౌలిక వసతుల కోసం సమశీలంగా ప్రజలు పోరాటాలకు సిద్ధం కావాలని వారు కోరారు. ఈ సమావేశంలో సిపిఎం పట్టణ కార్యదర్శి ఏ.రణధీర్, సురేంద్ర, ఇస్మాయిల్, తదితరుల పాల్గొన్నారు.

2 సార్లు పట్టాలు పంపిణీ ఘనత తనదే

ఎమ్మెల్యే కాటసాని రామి రెడ్డి


భూ పంపిణీ పట్టాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామి రెడ్డి

ప్రజాశక్తి - అవుకు

బనగానపల్లె నియోజకవర్గంలో రెండుసార్లు భూ పంపిణీ పట్టాలు పంపిణీ చేసిన ఘనత తనదేనని, అసమర్ధ నాయకుడు ఎవరో ప్రజలకు బాగా తెలుసునని బనగానపల్లె శాసనసభ్యులు కాటసాని రామిరెడ్డి అన్నారు. ఆదివారం అవుకు పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద తాసిల్దార్ ప్రసాద్ బాబు ఏర్పాటుచేసిన భూ పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అవుకు పట్టణాన్ని చెందిన 244 మంది లబ్ధిదారులకు 244.25 ఎకరాల భూమిని నిరుపేదలైన లబ్ధిదారులకు తన చేతుల మీదుగా అందిం చటం గర్వకారణంగా ఉందని ఎమ్మెల్యే సంతో షం వ్యక్తం చేశారు. గతంలోనూ తాను మొట్టమొదటిసారి శాసనసభ్యునిగా ఉన్న సమయంలో భూ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని, మరల ఇప్పుడు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాలనలో నిరుపేదలైన లబ్ధిదారులకు భూ పంపిణీ కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. గొప్పలు చెప్పుకునే తెలుగుదేశం పార్టీ నాయకులు ఎప్పుడైనా భూ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహి ంచారా అని ప్రశ్నించారు. అవుకు పట్టణంలో కోట్లాది రూపాయలతో సిమెంట్ రోడ్లను వేయడం జరిగిందని, అంతేకాకుండా రూ.ఒక కోటి 25 లక్షలతో కళ్యాణ మండపాన్ని నిర్మించేందుకు ఈ మధ్యనే భూమి పూజ నిర్వహించడం జరిగిందని తెలిపారు. మండల ప్రజలకు వైద్య సౌకర్యాన్ని అందిం చేందుకు అవుకు పట్టణంలో ఉన్న ప్రభుత్వాసుపత్రిని రూ.రెండు కోట్ల 50 లక్షలతో ఆధునికరించడం జరిగిందని తెలిపారు. త్వరలోనే అవుకు పట్టణంలో ప్రజల కు ఇంటి స్థలాలను కూడా పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ చల్లా విజయభాస్కర్ రెడ్డి, అవుకు మండల జడ్పిటిసి చల్లా శ్రీలక్ష్మి, యువ నాయకులు కాటసాని ఓబుల్ రెడ్డి, అవుకు మండల వైసీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్రెడ్డి, వైసిపి నాయకులు దుగ్గిరెడ్డి రవీంద్రారెడ్డి, మహిళలు ప్రజలు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బనగానపల్లె : వైసీపీ పాలనలోనే పేద ప్రజల అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని ఎంపిడీవో కార్యాలయంలోని పొదుపు భవనంలో జగనన్న భూ పంపిణీ కార్యక్రమాన్ని మండల తహసీల్దారు కిషోర్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని పలుకూరు, రామతీర్థం, చెరువు పల్లె, బీరువోలు గ్రామాలకు చెందిన 532 మంది లబ్ధిదారులకు 896.99 ఎకరాల భూ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి లబ్ధిదారులకు పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భ ంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో సంక్షేమం ప్రభుత్వ సంక్షేమం, అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. జగనన్న భూ పంపిణీ కార్యక్రమంలో భాగంగా మండలం లోని పలుకూరు, రామతీర్థం, చెరువు పల్లె,బీరవోలు గ్రామాలకు సంబంధించి 532 మంది లబ్ధిదారులకు 869.99 ఎకరాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. అర్హులైన వారికి మళ్లీ రెండో విడతలో భూ పంపిణీ కార్యక్రమం త్వరలోనే చేపడతామని చెప్పారు. నిత్యం ప్రజల కోసం కష్టపడే మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ని 2024 ఎన్నికల్లో మళ్ళీ ముఖ్యమంత్రిగా, తనను ఎమ్మెల్యేగా అత్యధిక మెజార్టీతో గెలిపించాల న్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి యువజన విభాగం జిల్లా అధ్యక్షులు గుండం నాగేశ్వరరెడ్డి, రామతీర్థం సర్పంచ్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.


బ్ధిదారులకు భూ హక్కు పట్టాలను అందిస్తున్న ఎమ్మెల్యే కాటసాని

శ్రీగిరిపై పోటెత్తిన భక్తజనం

ప్రజాశక్తి - శ్రీశైలం



కార్తీక మాసం సందర్భంగా శ్రీశైల క్షేత్రంలో భక్తుల బాగా పెరిగి శ్రీగిరిపై పోటెత్తిన భక్తజనంతో శ్రీశైలం ప్రధాన వీధులన్నీ భక్తులతో కిటకిటలా డుతున్నాయి. కార్తీక మాసంలో రెండవ శని వారం, ఆదివారం, సోమవారాల తోపాటు పౌర్ణమి ఆదివారం సోమవారా లలో ఉండడం అంతేకాక శని ఆది వారాలు సెలవు దినాలు కావటంతో పాటు కార్తీక సోమవారం సందర్భంగా విద్యాసంస్థలన్నీ కూడా సెలవు ప్రకటించడంతో భక్తులు అత్యధిక సంఖ్యలో మహాశివరాత్రిని తలపించే విధంగా భక్తులు కిటకిటలాడుతున్నారు. చలి తీవ్రత పెరిగినప్పటికీ చలిని లెక్కచేయకుండా తెల్లవారుజామున నాలుగు గంటల నుండి పాతాళ గంగలో స్నానాల గురించి స్వామి అమ్మవారిని దర్శించుకునేందుకు క్యూలైన్లో వేచి ఉన్నారు. స్పర్శ దర్శనం ఆర్జిత సేవలు అభిషేకాలు నిలిపివేయడం వలన భక్తులు శీఘ్ర, అతి శీఘ్ర, ఉచిత క్యూలైన్లలో వేచి ఉండి స్వామి అమ్మవాలను దర్శించుకుంటున్నారు. స్వామి, అమ్మవాలను దర్శించుకునేందుకు మూడు, నాలుగు, గంటల సమయం పడుతుందని భక్తులు తెలిపారు. క్యూ కాంప్లెక్స్‌లో వేచి ఉన్న భక్తులకు ఉచితంగా మంచి నీరు అల్పాహారం బిస్కెట్లు అందజేస్తున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని పరిపాలన భవనంలో పనిచేసే సిబ్బంది ప్రత్యేక డ్యూటీలు కేటాయించారు. భక్తులు లడ్డు ప్రసాదాలనుకునేందుకు అధిక కౌంటర్లను ఏర్పాటు చేసి, క్షేత్ర పరిధిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం వాటి ద్వారా క్షేత్ర పరిధిలో ఎలాంటి ఆలోచనలు సంఘటనలు జరగకుండా ఉండేందుకు సీసీ కెమెరాలు ద్వారా కంట్రోల్ రూమ్‌లో పర్యవేక్షిస్తున్నారు. ఆత్మకూరు డిఎస్పి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయగా, దేవస్థానం కార్య నిర్వహణాధికారి పెద్దిరాజు నిరంతరం క్షేత్ర పరిధిలో పర్యవేక్షిస్తూ ఉన్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఆలయ అధికారులు తెల్లవారుజామున మూడు గంటలకి ఆలయ ద్వారాలు తెరిచి మహా మంగళహారతి అనంతరం భక్తులకు దర్శనానికి అనుమతిచ్చారు.


మాట్లాడుతున్న కెవిపిఎస్ నాయకులు

అంగన్వాడీల సమస్యలను పరిష్కరించండి

సమ్మెకు మద్దతు : కెవిపిఎస్

ప్రజాశక్తి - వెలుగోడు

వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు అంగన్వాడీల సమస్యలను పరిష్కరిస్తామని చెప్పి మళ్లీ ఎన్నికల దగ్గర పడుతున్నా.. పరిష్కరించడం లేదని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రామ దాసు అన్నారు. ఆదివారం సిఐటియు కార్యా లయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వైయస్ జగన్మోహన్ రెడ్డి తెలంగాణ కంటే ఎక్కువగా వేతనాలు పెంచుతామని మాట ఇచ్చి మరల రెండు నెలలు ఉంటే ఎన్నికలు వచ్చినా అంగన్వాడీల సమస్యలు పరిష్కరించ లేదన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారము అంగన్వాడీలకు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి గ్రాట్యూటీ అమలు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఐదు లక్షలు, వేతనంలో సగం పెన్షన్, హెల్పర్ల ప్రమోషన్లకు వయోపరిమితి 50 సంవత్సరాలకు పెంపు, సర్వీసులో ఉండి చనిపోయిన కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, రిటైర్మెంట్ వయసు 62 సంవత్స రములకు పెంపు తదితర సమస్యల కోసం అనేకసార్లు అంగన్వాడీలు ఎమ్మార్వో కార్యాలయాల ముందర జిల్లా కలెక్టర్ గారి కార్యాలయాల ముందర అమరావతిలో మహాధర్నాలు చేసిన ప్పటికీ ప్రభుత్వం పరిష్కరించకపోవడం వలన రాష్ట్రవ్యాప్తంగా సమ్మెకు పిలుపునివ్వడం జరిగిందని, సమ్మెకు కెవిపిఎస్ సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందన్నారు. ఈ సమావేశంలో వెంకటయ్య, నబి రసూల్, కిషోర్, రహంతుల్లా, కరిముల్లా, నూరుల్లా, కృష్ణ, ఖాదర్ వలీ తదితరులు పాల్గొన్నారు.

జగనన్నను మళ్ళీ గెలిపించాలి : వైసిపి


పల్లెకు పోదాం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న చక్రం షబ్బీర్

ప్రజాశక్తి - చాగలమర్రి

రాష్ట్రంలో అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలు ఆగకుండా అమలు కావాలంటే జగనన్నను మళ్ళీ ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాల్సిన భాద్యత మనపై ఉందని వైసిపి సినియర్ నాయకులు చక్రం ముల్లా షబ్బీర్ అన్నారు. ఆదివారం చాగలమర్రిలోని 5వ సచివాలయం పరిధిలోని 19వ వార్డు గుంతపాళెం వీధిలో పల్లెకు పోదాం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వార్డుల్లో "వై ఏపి నీడ్స్ జగన్" కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి వెళ్ళి జగనన్న చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. వచ్చే ఎన్నికలలో రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్రెడ్డిని అత్యధిక మేజారీటీతో తప్పక గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో సచివాలయ గృహసారధులు లైటింగ్ మహబుబ్బేరాన్, ఆరీఫ్, వాలంటీర్లు. వార్డు నాయకులు తోమ్మంద్రు నాగేంద్రకుమార్, కార్యకర్తలు పాల్గోన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - బేతంచెర్ల


నాగరాజు శెటి (ఫైల్)

బేతంచెర్ల పట్టణం బనగానపల్లి రైల్వే గేట్లను బేతంచెర్ల పట్టణం సంజీవనగర్ కాలనీవాసి అయినా ఆర్ నాగరాజు శెట్టి (62) ఆదివారం నాడు ఉదయం దాదాపు ఆరు గంటల సమయంలో బనగానిపల్లి రైల్వే గేట్లను (రైల్వే ట్రాక్) దాటుండగా డోన్ నుండి నంద్యాల వైపు వెళుతున్న గరీబ్ రథ్ ఎక్స్ప్రెస్ రైలు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు మృతుడు నాగరాజ్ శెట్టి మానసిక స్థితి సరిగా లేకపోవడం చెవుడు ఉండడం వలన రైల్వే గేట్లను దాటుతుండగా వచ్చే రైలును గమనించకపోవడంతో రైలు ఢీకొనడంతో తల, మొండెం వేరై నాగ రాజు శెట్టి మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య జయమ్మ, కొడుకు శ్రీరాములు, కూతురు శ్రీవాణి ఉన్నారు. డోన్ రైల్వే పోలీస్ వారు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

రైతన్నకు బాసటగా నిలవాలి

సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో 'రైతు కవనం'
- సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షులు యం. శ్రీనివాసమూర్తి

ప్రజాశక్తి - నంద్యాల


రైతు కవనంలో కవిత వినిపిస్తున్న నీల వెంకటేశ్వర్లు

విత్తనం నుంచి విత్తనం, విత్తనం నుంచి విత్తనం సృష్టిస్తూ బంగారు పంటలు పండించిన చరిత్ర మన రైతన్నదని వారికి బాసటగా నిలవాలని సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షులు యం. శ్రీనివాసమూర్తి తెలిపారు. అఖిల భారత కిసాన్ సభ జాతీయ కౌన్సిల్ సమావేశాలు కర్నూలులో జరుగబోతున్న సందర్భంగా ఆదివారం సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో "రైతు కవనం" పేరుతో కవిసమ్మేళనంను శ్రీ పింగళి సూరన స్మారక శాఖా గ్రంథాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ రైతు జీవితం నానాటికీ దుర్భరమవుతున్న నేపథ్యంలో పంటలు పండక, గిట్టుబాటు ధర లభించక, సకాలంలో వర్షాలు కురవక, తుఫాన్‌ల వలన, నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు రైతును నట్టేట ముంచుతున్నాయన్నారు. పండిన పంటకు సరైన గిట్టుబాటు ధర లేక రైతులు అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. కావున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సంక్షేమం కోసం కృషిచేయాలన్నారు. సాహితీ స్రవంతి ప్రధాన కార్యదర్శి డా నీలం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రైతులు పండించిన పంటకు రెట్కతులే గిట్టుబాటు ధరను నిర్ణయించేలా ప్రభుత్వ విధానాలుండాలన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన రైతు కవనంలో కవులు బాలరాజు, మాబుబాష, రఫీ, సతీష్ కుమార్, శేషు ఫణి, నీలకంతమాచారి, బాలరాజులు వ్యవసాయరంగంలో రైతులు ఎదుర్కొం టున్న సంక్షోభం, రైతుల వ్యథలపై తమ కవితలను వినిపించారు. ఈ కార్యక్రమంలో సాహితీ స్రవంతి ఉపాధ్యక్షులు మణిశేఖరరెడ్డి, కార్యదర్శి డా నీలం వెంకటేశ్వర్లు, మధుసూధన్, వెంకటరాముడు, జెవివి నాయకులు గోపాల్, రైతులు శివనాగిరెడ్డి, ప్రతాపరెడ్డి, బాలకృష్ణుడు, ఉపాధ్యాయులు, సాహితీ ప్రియులు పాల్గొన్నారు.

వైసిపి పాలనలో తాగునీరు కరువు : టిడిపి


ప్రజలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్ రెడ్డి

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

వైసిపి పాలనతో ప్రజలకు గుక్కెడు నీళ్లు అందించడంలో ఎమ్మెల్యే కాటసాని విఫలం అయ్యారని బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్ రెడ్డి ఆరోపించారు. బనగానపల్లె తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం కొలిమిగుండ్ల మండలంలో అంకిరెడ్డిపల్లె గ్రామంలో నిర్వహించిన బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్ రెడ్డికి ఐవి పక్కీరా రెడ్డికి టీడీపీ అంకిరెడ్డిపల్లెలో టీడీపీ నాయకులు నంద్యాల నారాయణరెడ్డి రామేశ్వర రెడ్డి, రవి ప్రకాష్ రెడ్డి, రామచంద్రా రెడ్డి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్ రెడ్డి ప్రజా వేదికను ఉద్దేశించి మాట్లాడారు. అంకిరెడ్డిపల్లె ప్రజలు తాగునీరు కొరకు తీవ్ర ఇబ్బందులు ఎదురుకుంటున్నారని, ప్రజలకి ప్రాణధారమైన తాగునీటిని సరఫరా చేయడంలో ఎమ్మెల్యే విఫలం అయ్యారని మండిపడ్డారు. నియోజకవర్గంలో నా సొంత నిధులతో దాదాపు 60 మినరల్ వాటర్ ప్లాంట్స్ ప్రత్యక్షంగా,పరోక్షంగా ఇప్పటికి నడుపుతున్నట్టు బీసీ తెలిపారు. కాటసానికి ఎప్పుడు కూడా ప్రజల యోగ క్షేమాలు పట్టవని,కేవలం తన సొంత స్వార్థ రాజీకీయాలు కోసం పరితపిస్తూ ప్రజలను బలిపశు వులను చేస్తున్నాడని బీసీ జనార్థన్ రెడ్డి తీవ్ర విమర్శలు గుప్పించారు. నాపరాయి పరిశ్రమ యజమానులను గత నాలుగున్నారేళ్లుగా ఇబ్బందులకు గురిచేస్తూ వారికి గతంలో ఎన్నికల హామీలలో భాగంగా రాయల్టీ చెక్‌పోస్ట్‌ను ఎత్తివేస్తామని చెప్పి,కొట్టం లాగ ఉన్న చెకపోస్ట్ నుబిల్డింగ్ లాగా కట్టిన అసమర్థ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అని పేర్కొన్నారు. అంకిరెడ్డిపల్లె గ్రామంలో 2014 నుంచి 2019 వరకు తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో రూ.374 లక్షలతో అభివృద్ధి చేసినట్టు వివరించారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక గ్రామంలలో ఒక్క అభివద్ధి జరగకపోగా వెనక్కి పోయిందని ఆరోపించారు. ఈ సందర్భంగా 6 భవిష్యత్తు గ్యారంటి పథకాల గురించి ప్రజలకు బీసీ జనార్ధన్ రెడ్డి వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోటపాడు శివరామిరెడ్డి, టిడిపి మండల అధ్యక్షులు ఎం రామేశ్వర్ రెడ్డి, అంకిరెడ్డిపల్లెలో నంద్యాల నారాయణరెడ్డి, రామేశ్వర రెడ్డి, రవి ప్రకాష్ రెడ్డి, రామచంద్రా రెడ్డి, పిసి రెడ్డి విఆర్ లక్ష్మిరెడ్డి, అంబటి జయలక్ష్మి రెడ్డి, వివేకానంద రెడ్డి సత్యం రెడ్డి, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు. **బేతంచెర్ల :** రాష్ట్రంలో అభివృద్ధి జరగాలంటే తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమ వుతుం దని ఆ పార్టీ రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి రవీంద్ర నాయక్, పట్టణ కార్య దర్శి షేక్షావలి చౌదరి అన్నారు. బేతంచర్ల పట్టణ ంలోని కొత్త బస్టాండ్ ఏరియా శేషారెడ్డి నగర్ ఆయా కాలనీ లలో పట్టణ కార్యదర్శి షేక్షావల్లి చౌదరి ఆధ్వర్య ంలో బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహి ంచారు. వారు సూపర్ సిక్స్ పథకాల గురించి ఇంటింటికి తిరుగుతూ వివరించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస గౌడ్, రామకృష్ణ, వంశీకృష్ణ మధుసూదన్ కన పకుంట మధు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. **రుద్రవరం :** వైసీపీ పాలనలో విసిగిపోయిన ప్రజలు తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడానికి ప్రజలు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్నారని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ అన్నారు. మండల పరిధిలోని తువ్వ పల్లి గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో ఆమె పాల్గొని ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేసి తెలుగుదేశం పార్టీని గెలిపించాలని ప్రజల కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆళ్లగడ్డ నియోజకవర్గం లో కెసి కెనాల్, తెలుగుగంగ ఆధారంగా రైతులు పంటలు సాగు చేసిన రైతులకు నీరందించే పరిస్థితిలో స్థానిక ఎమ్మెల్యే, ప్రజా ప్రతినిధులు ఉన్నారని అన్నారు. మిగతా 6వ పేజీలో..


మాట్లాడుతున్న టిడిపి రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి రవీంద్ర నాయక్


గాయపడిన విఆర్ఓ ను పరామర్శించిన వీఆర్వోల సంఘం అధ్యక్షులు

విఆర్ఒల విధి నిర్వహణపై అధికారుల తీరు మార్చుకోవాలి

- విఆర్ఒల సంఘం

ప్రజాశక్తి - పాములపాడు

రోడ్డు ప్రమాదంలో గాయపడిన బానకచర్ల విఆర్వో మద్దిలేటిని విఆర్వోల సంఘం ఉమ్మడి కర్నూలు జిల్లా అధ్యక్షులు ఆర్ నరసరాజు, జిల్లా ఉపాధ్యక్షులు బుద్ధకవిలు ఆదివారం పరామర్శించారు. రోడ్డు ప్రమాదానికి గల కారణాలు ఎలా జరిగిందని వాటిపై వారు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు వీఆర్వోలకు సాయంత్రం ఐదున్నర గంటల వరకు విధులు నిర్వహించాలని ఉన్నప్పటికీని మండల రెవెన్యూ అధికారులు విఆర్ఓలపై ఒత్తిడి తెచ్చి అధికపని భారం పెట్టి విఆర్వోలను పలు ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. మద్దిలేటి శుక్రవారం రాత్రి బిఎల్ఓ విధులు ముగించుకొని బైకుపై నందికొట్కూరు నుండి ఇంటికి బయలుదేరిన క్రమంలో పాములపాడులో రోడ్డు ప్రమాదానికి గురయ్యారని, అధికారులు విఆర్ఓలపై ఒత్తిడి తగ్గించాలన్నారు. రాత్రిలో కూడా పని చెప్పడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో పాములపాడు విఆర్వోల సంఘం నాయకులు హుస్సేన్, సుందర్ రావు వీఆర్వోలు రషీద్, శ్రీనివాసులు, స్వామన్న, సామేలు తదితరులు పాల్గొన్నారు.

నేడు జగనన్నకు చెబుదాం - స్పందన

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు సోమవారం నాడు నంద్యాల పట్టణం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాలులో జగనన్నకు చెబుదాం - స్పందన కార్యక్రమం ఉంటుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలాని సామూన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపా రు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించే స్పందన కార్యక్రమానికి ఉదయం 9-30 గంటలకు జిల్లాధికారులందరూ హాజరు కావాలని కలెక్టర్ తెలిపారు. అలాగే జిల్లా కేంద్రంతో పాటు మండల, నియోజకవర్గ, డివిజన్ స్థాయిలో కూడా యథాతథంగా "జగనన్నకు చెబుదాం - స్పందన" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com


ఫ్రూట్స్ బండ్ల ఓనర్లకు చెప్తున్న అధికారులు

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు అవగాహన

- సహాయ కమిషనర్ ఎన్. బసీ రున్నిసా బేగం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించేందుకు ప్రజల్లో అవగాహన అవసరమని కార్మిక శాఖ సహాయ కమిషనర్ ఎన్. బసీరున్నిసా, మున్సిపల్ కమిషనర్ సి. రవిచంద్ర రెడ్డి అన్నారు. ఆదివారం మున్సిపల్ కమిషనర్ సి. రవి చంద్రా రెడ్డితో కలిసి కార్మిక శాఖ సహాయ కమిషనర్ ఎన్. బసీరున్నిసా నంద్యాల పట్టణంలోని ఫ్రూట్స్ మార్కెట్లోనూ, శ్రీనివాస్ సెంటర్ గంగా హోటల్ పరిసర ప్రాంతాల్లోని టు వీలర్ మెకానిక్ షాపులలోను ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో బాల కార్మికులు ఎవరు లేనట్లు గుర్తించినట్లు కార్మిక శాఖ సహాయ కమిషనర్ ఎన్. బసీరున్నిసా తెలిపారు. బడి ఈడు పిల్లలను పనుల్లో పెట్టుకొని బాల కార్మికులుగా మార్చితే అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. తనిఖీల్లో మునిసిపల్ హెల్త్ ఆఫీసర్ డా. అంకి రెడ్డి, శానిటరీ ఇన్స్పెక్టర్, శానిటరీ సెక్రటరీలు తదితరులు ఉన్నారు.


నూతన కార్యవర్గాన్ని అభినందించిన ఎమ్మెల్యే శిల్పా

దేవాలయ అభివృద్ధికి నూతన కార్యవర్గం పాటుపడాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

దేవాలయ అభివృద్ధికి నూతన కార్యవర్గం పాటుపడాలని, దేవాల యాల్లో ఆధ్యాత్మికతను పెంపొందించాలని, భక్తుల మనోభావాలు దెబ్బతినకుం డా ఆలయాల్లో పవిత్రతను కాపాడాలని నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నంద్యాల పట్టణంలోని శ్రీ కాళికాంబ చంద్రశేఖర స్వామి దేవాలయంలో నూతన కార్యవర్గ అభినందన సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే శిల్పా రవి మాట్లాడుతూ దేవాలయ కమిటీ సభ్యులు దేవాలయ అభివృద్ధికి పాటుపడాలని కోరారు. నంద్యాల పట్టణంలో అతి పురాతనమైన దేవాలయం శ్రీ కాళికాంబ చంద్ర శేఖర స్వామి దేవాలయమని, అమ్మవారి ఆశీస్సులు ప్రతి ఒక్కరికీ కలగాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్,కౌన్సిలర్లు ఖండే శ్యాంసుందర్ లాల్, కలాంబాషా, సాదిక్, ఏపీఎస్పీ డీసీఎల్ డైరెక్టర్ శశికళ రెడ్డి, మాజీ కౌన్సిలర్ భీమునిపల్లి వెంకటసుబ్బయ్య, కో ఆప్షన్ సభ్యులు పడకండ్ల సుబ్రహ్మణ్యం, పుర ప్రముఖులు నెరవాటి సత్యనారాయణ, బైసాని రమేష్, మేడా లక్ష్మయ్య, నెరవాటి రవితో పాటు పాలకమండలి ఛైర్మన్ ఆరవేటి శ్రీనివాసులు, ధర్మకర్తలు విజయ కుమార్, నాగమణి బాయి, ప్రతాప్, వరలక్ష్మి, లింగమ్మ, లక్ష్మి, ఇఓ వెంకట రమణాచారి తదితరులు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలని పనిలో పెట్టుకుంటే నేరం

ప్రజాశక్తి - పగిడ్యాల

18 సంవత్సరాల లోపు పిల్లలని పనిలో పెట్టుకుంటే చట్టరీత్యా నేరమని ఎంఈఓ సుభాన్, మాజీ జెడ్పిటిసి పుల్యాల నాగిరెడ్డి అన్నారు. బడియుడు పిల్లలని బడికి పంపించాలని కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండల కేంద్రం పగిడ్యాలలో వాడవాడలా తిరిగి నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహిస్తూ, ఆటోలో మైకుతో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. 18 సంవత్సరాల లోపు పిల్లలను పనిలో పెట్టుకున్న యజమాని పై, పనికి పంపించిన తల్లిదండ్రులపై చట్టపకారం చర్యలు తీసుకోబడుతుందన్నారు. చదువుకునే వయసులో పిల్లలని పనికి పంపించడం సరికాదనితల్లిదండ్రులకు సూచించారు. పిల్లల కోసం పాఠశాలలో ప్రభుత్వం అన్ని వసతులు కల్పిస్తుందని వారికి ఎటువంటి ఫీజులు కట్టి బడికి పంపించాల్సిన అవసరం లేదని అన్ని ప్రభుత్వమే చూసుకుంటుందన్నారు. పిల్లలను బడికి పంపితే రాష్ట్ర ప్రభుత్వం తల్లిదండ్రుల ఖాతాలో డబ్బులు జమ చేస్తుందని అన్నారు. అందువల్ల ప్రతి పిల్లవాడిని బడికి తప్పకుండా పంపించాలని తల్లిదండ్రులను కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెరుమాళ్ళ శేషన్న, రెండవ ఎంఈఓ మురళీమోహన్ రెడ్డి, వెల్ఫేర్ అసిస్టెంట్ గణేష్ గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

జెసిబిని ప్రారంభించిన చైర్మన్

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

నందికొట్కూరు మున్సిపాలిటీకి సంబంధించి 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా 2020-21, 2వ ఫేస్‌లో రూ.36 లక్షలతో నందికొట్కూరు మున్సిపాలిటీకి నూతన జెసిబిని కొనుగోలు చేశారు. ఆదివారం పట్టణం లోని మున్సిపల్ కార్యాలయం నందు జె.సి.బి కి మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి పూజ కార్యక్రమం చేసి ప్రారంభించారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ పట్టణంలోని 29 వార్డులకు సంబంధించిన పనులకు జెసిబి ఎంతో ఉపయో గపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ అర్షపోగు ప్రశాంతి, కౌన్సిలర్లు చిన్న రాజు, నయుబ్, లాలు, అశోక్, చాంద్ బాషా, హమీద్, సురేష్, కో- ఆప్షన్ సభ్యులు గఫర్, వార్డు ఇంచా ర్జీలు రజినీ కుమార్ రెడ్డి, రమేష్, కురువ శీను, సత్య నారా యణ, శాలి బాషా, డి. రమేష్, తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మకతను వెలికి తీసేందుకే సైన్స్ ఎగ్జిబిషన్

ప్రజాశక్తి - పగిడ్యాల

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసేందుకు సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహి ంచడం ఎంతో అవసరమని కర్నూల్ ప్రభుత్వ వైద్యశాల రేడియాలజిస్ట్ డాక్టర్ హరినాథ్, ఎంఈఓ సుభాన్ అన్నారు. ఆదివారం మండలంలోని లక్ష్మాపురం అంచ సమీపాన ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశా లలో సైన్స్ ఎగ్జిబిషన్‌తో పాటు తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన డాక్టర్ హరినాథ్, ఎంఈఓ సుభాన్ మాట్లాడారు. విద్యార్థులలో సృజనాత్మకతను విజ్ఞానాన్ని పెంపొందిం చడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తారన్నారు. ఇలాంటి సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించడం వలన విద్యార్థుల్లో ఉన్న మేధస్సును బయటికి తీయొచ్చున్నారు. ఉపాధ్యాయులకు విద్యార్థులను మంచి విద్యను బోధించి వారిని ఉన్న స్థాయికి తీసుకెళ్లే బాధ్యత ఉంటుందన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు మంచి విద్యను క్రమశిక్షణను బోధిస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రుల సహకారం ఎంతో అవసరమని విద్యార్థుల తల్లిదండ్రులకు వారు సూచించారు. ప్రిన్సిపాల్ వెంకటరమణ మాట్లాడుతూ డిసి ఓ శ్రీదేవి ఆదేశాల మేరకు సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించడం జరిగిందన్నారు. ఎగ్జిబిషన్ తిలకించేందుకు విద్యార్థుల తల్లిదండ్రులను పిలిపించాలని ఆదేశించడంతో తల్లిదండ్రుల గురుగా పిలిపించడం జరిగిందన్నారు. ఫిజిక్స్ లెక్చరర్ ఉమామహేశ్వరప్ప, రెండవ ఎంఈఓ మురళీ మోహన్ రెడ్డి, ఉపాధ్యాయులు విద్యార్థినిలు తల్లిదండ్రులు పాల్గొన్నారు.


సైన్స్ ఎగ్జిబిషన్ పరిశీలిస్తున్న డాక్టర్ శ్రీనాథ్ రెడ్డి , ఎంఈఓ సుభాన్

అనాధలకు బీసీ రాజారెడ్డి నిత్యావసరాలు

ప్రజాశక్తి - బనగానపల్లె

అనాధలను ఆదుకునేందుకు మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి తమ తల్లిదండ్రులు బిసి గుర్రెడ్డి, బీసీ లక్ష్మమ్మల జ్ఞాపకార్థం 80 ప్యాకెట్ల నంద్యాల సోనామసూరి బియ్యం, 20 ప్యాకెట్లు ఉప్మా రవ్వను సోమవారం పంపించారు. ఆదివారం బీసీ రాజారెడ్డి సొంత ఖర్చులతో రంగారెడ్డి జిల్లా బాలాపూర్ మండలం నాదర్గుల్ లో ఉన్న మాతృదేవోభవ ఆనంద ఆశ్రమానికి లారీలో జెండా ఒపి బీసీ రాజారెడ్డి పంపించారు. ఈ సందర్భంగా రాజారెడ్డి మాట్లాడుతూ కొన్ని సామాజిక మాధ్యమాల ద్వారా రంగారెడ్డి జిల్లా బాలా పూర్ మండలం నాదర్గుల్‌లో ఉన్న మాతృదేవోభవ ఆనంద ఆశ్రమం గురించి తెలుసుకొని ఇటీవల ఆశ్రమాన్ని స్వయంగా సందర్శించినట్లు తెలిపారు. అనాధలు ఉండేందుకు వసతి ఉన్నా తినేందుకు సరైన ఆహార ధాన్యాలు లేవని ఆశ్రమ నిర్వాహకులు తన దృష్టికి తీసుకురాగా తమ వంతుగా ఏదైనా సాయం చేయాలని ఆరు నెలలకు సరిపడా ఆహార ధాన్యాలను పంపిస్తానని హామీ ఇచ్చి, రూ. 3 లక్షల విలువ చేసే నంద్యాల సోనా మసూరి సన్న బియ్యం 80 ప్యాకెట్లు, 20 ప్యాకెట్ల గోధుమ రవ్వను లారీ ద్వారా ఆశ్రమానికి పంపించిన్నట్లు తెలిపారు. నా అనే వారు లేని అనాధలు, నిరాశ్రయులకు అండగా ఉన్న మాతృదేవోభవ అనాధ ఆశ్రమానికి తన వంతుగా సేవ చేసే భాగ్యం కలగడం అదృష్టంగా భావిస్తున్నానని బిసి రాజారెడ్డి తెలిపారు. గత సంవత్సరం భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లోని అనాధ శరణాల యానికి రూ. 3 లక్షల సొంత డబ్బులతో 100 ప్యాకెట్ల నంద్యాల సోనా మసూరి సన్న బియ్యా న్ని పంపించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఉపసర్పంచ్ బురాను ద్దీన్, టిడిపి నాయకులు కాట్రెడ్డి మల్లికార్జునరెడ్డి, అన్వర్ సాహెబ్, లాయర్ నాగేంద్ర రెడ్డి, అహ్మద్ హుస్సేన్, టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


య్యం లారీని జండా బిపి పంపిస్తున్న బీసీ రాజారెడ్డి

ఎల్ఐసి కలెక్షన్ పాయింట్ ఏర్పాటు అభినందనీయం : చైర్మన్

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

నందికొట్కూరు పాలసీదారులకు మెరుగైన సేవలు అందించేందుకు నందికొట్కూరు పట్టణంలో జీవిత బీమా పాలసీదారుల కొరకై కలెక్షన్ పాయింట్‌ను ప్రారంభించడం అభినందనీయమని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి అన్నారు. ఆదివారం నందికొట్కూరు నియోజకవర్గ కేంద్రమైన పట్టణంలోని స్థానిక కొత్త బస్టాండ్ సమీపంలో జోనల్ మేనేజర్ క్లబ్ నెంబర్ సగినేల స్వామిదాస్ ఏర్పాటు చేసిన జీవిత బీమా పాలసీదారుల కలెక్షన్ పాయింట్ ను మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి, ఆత్మకూరు ఎల్ఐసి బ్రాంచ్ మేనేజర్ పాండురంగ నాయక్, అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ మధుసూదన్ శెట్టి, విశ్రాంత ఎస్ఐ పెరుమాళ్ళ జాన్ లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆత్మకూరు ఎల్ఐసి బ్రాంచ్ మేనేజర్ మాట్లాడుతూ ప్రపంచంలో అతిపెద్ద ఇన్సూరెన్స్ రంగంలో ఎల్ఐసి 4 వ స్థానంలో ఉందని భారతదేశంలో మొదటి స్థానంలో ఉందన్నారు. ప్రస్తుతం ఎల్ఐసిలో 30 కోట్ల పాలసీదారులు ఉన్నారని 24 ప్రైవేట్ కంపెనీలు ఉన్నప్పటికీ దేశంలోనే ఎల్ఐసిదే నెంబర్ వన్‌గా నిలిచిందన్నారు. ఆధునిక టెక్నాలజీలో రెండో స్థానంలో నిలిచిందని వినియోగదారుల సేవా కేంద్రంలో పాలసీదారులు ఎనీ టైం పాలసీలు కట్టుకోవచ్చు అన్నారు. పాలసీదారులు ఆత్మకూరుకు వెళ్లకుండా నందికొట్కూరులోనే సేవలు వినియోగించుకోవచ్చు అన్నారు. సగినేల స్వామి దాస్ డివిజన్ స్థాయి నుండి జోనల్ మేనేజర్ క్లబ్ మెంబర్ స్థాయికి ఎదిగి పాలసీదారులకు నిత్యం సేవలందిస్తూ దినదిన అభివృద్ధి చెందుతూ ముందుకు వెళ్తున్నారని బ్రాంచ్ మేనేజర్ పాండురంగ నాయక్ సంతోషం వ్యక్తం చేశారు. కలెక్షన్ పాయింట్ ప్రారంభించిన వెంటనే పశుసంవర్ధక శాఖ మాజీ జాయింట్ డైరెక్టర్ పెరుమాళ్ళ నాగన్న ఎల్ఐసిలో రూ.10 లక్షల చెక్కును డిపాజిట్ చేయడం జరిగిందని డిపాజిట్ చేసిన వ్యక్తికి మున్సిపల్ చైర్మన్ దాసీ సుధాకర్ రెడ్డి దుశ్యాలతో సన్మానించారు. ఆత్మకూరు బ్రాంచ్ మేనేజర్ పెరుమాళ్ళ నాన్నను అభినందించారు. అనంతరం జోనల్ మేనేజర్ క్లబ్ మెంబర్ సగినేల స్వామి దాస్ చేతుల మీదుగా మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి, ఆత్మకూరు బ్రాంచ్ మేనేజర్ పాండురంగ నాయక్, అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ మధుసూదన్ శెట్టి, విశ్రాంత ఎస్సై పెరుమళ్ళ జాన్ లకు పూలమాలవేసి దుశ్యాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో 12వ వార్డు కౌన్సిలర్ లాలు ప్రసాద్, ఎల్ఐసి ఏజెంట్లు, తదితరులు పాల్గొన్నారు.


అభినందిస్తున్న చైర్మన్

వైసిపి పాలనలో తాగునీరు కరువు : టిడిపి

5వ పేజీ తరువాయి..

రానున్న ఎన్నికలలో తెలుగుదేశం పార్టీని గెలిపించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు యువరాజు, టిడిపి ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొమ్మలపాటి రాజారావు, ముత్తలూరు రామసుబ్బారెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, రెక్కల మనోహర్ రెడ్డి, అల్లడి చంద్రశేఖర్, చక్రవర్తులపల్లె లాయర్ నరసింహారెడ్డి, పోలా గురుమూర్తి, బాచేపల్లె నారాయణ, చిన్నకంబ లూరు శ్రీను, టిడిపి నాయకులు పాల్గొన్నారు. **పగిడ్యాల:** నందికొట్కూరు నియోజకవర్గ టిడిపి నాయకులు బండి జయరాజ్ మండలంలోని ప్రాతకోట గ్రామంలో భవిష్యత్తు గ్యారంటీ బాబు ష్యూరిటీ కార్యక్రమాన్ని నిర్వహించి మేనిఫెస్టోను వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఎస్సీ సెల్ నాయకులు జయసూర్య, మండల కన్వీనర్ పలుచాని మహేశ్వర్ రెడ్డి, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న టిడిపి నాయకులు


మాట్లాడుతున్న జగత్ విఖ్యాత్ రెడ్డి

అభివృద్ధి చంద్రబాబునాయుడుతోనే సాధ్యం : జగత్ విఖ్యాత్ రెడ్డి

ఆళ్లగడ్డ: రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబునాయుడుతోనే సాధ్యమని తాలుకా టిడిపి యువనేత భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని శోభ నాగిరెడ్డి కాలనీ, రామదాస్ వీధిలో భవిష్యత్తుకు గ్యారెంటీ అనే కార్యక్రమంలో భాగంగా ప్రజావేదిక నిర్వహించి తెలుగుదేశం పార్టీ ప్రవేశపెట్టిన పథకాలను వివరించి అనంతరం ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో టిడిపిని ఆశీర్వదిం చాలన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ హుస్సేన్ బాషా, మాజీ జెడ్పిటిసి చాంద్ బాషా, ఆర్ల నాగ శ్రీనివాసులు, కాంట్రాక్టర్ నన్నే బాయ్ గారి జిలాని, చింతకుంట రామశేఖర్ రెడ్డి, శంకరయ్య, గుండా మని తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారున్ని అభినందించిన బీసీ ఇందిరా

ప్రజాశక్తి - బనగానపల్లె

పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్ రెడ్డి నివాసంలో అంతర్జా తీయ యుసిఎంఎఎస్ అబాకస్ పోటీ పరీక్షలో రన్నర్‌గా నిలిచిన యెలిశెట్టి రుత్విక్‌ను మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్ రెడ్డి సతీమణి బీసీ ఇందిరా ఆదివారం అభినందించారు. ఈ సందర్భంగా బీసీ ఇందిరా మాట్లాడుతూ రుత్విక్ ఈ పోటీలలో రన్నర్‌గా రావడం సంతోషంగా ఉదన్నారు. ఈ పోటీ పరీక్షలో 34 దేశాల నుండి కొన్ని వేల మంది విద్యార్థులు పాల్గొనగా అందులో నంద్యాల విద్యార్థి రన్నర్ అప్‌గా నిలవటం దేశానికి, నంద్యాల జిల్లాకే గర్వ కారణం అన్నారు. ఓటిపి అకడమిక్స్ ఇలాంటి విద్యార్థులను తయారు చేసి పోటీ పరీక్షలకు సిద్ధం చేయడం హర్షించదగ్గ విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో ఓటిపి అకడమిక్స్ డైరెక్టర్ షేక్ మహబూబ్ బాషా, బ్రాంచ్ హెడ్ జయలలిత, బిజినెస్ హెడ్ ఫిరోజ్, సౌజన్య కోర్సు శిక్షకురాలు సరిత, రుత్విక్ తల్లి తండ్రులు పాల్గొన్నారు.


క్రీడాకారున్ని అభినందిస్తున్న బీసీ ఇందిరా

'లయన్స్'లో జిల్లా క్యాబినెట్ సమావేశం

ప్రజాశక్తి - నంద్యాల

అంతర్జాతీయ లయన్స్ సేవా సంస్థలో అంతర్భాగమైన 316 జె రాయలసీమ నెల్లూరు జిల్లాలకు చెందిన లయన్స్ జిల్లా క్యాబినెట్ సమావేశం ఆదివారం నంద్యాల ఎస్బిఐ కాలనీలో ఉన్న రామకృష్ణ పిజి కళాశాల ఆడిటోరి యంలో నిర్వహించారు. నంద్యాల లయన్స్ క్లబ్ నిర్వహణలో ఏర్పాటుచేసిన ఈ సమావేశానికి లయన్స్ జిల్లా గవర్నర్ వై నాగేశ్వరరావు యాదవ్ అధ్యక్షత వహించారు. లయన్స్ జిల్లా వైస్ గవర్నర్లు గౌతం, గోపాలకృష్ణ, ఐఎంఏ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర పాస్ట్ ప్రెసిడెంట్స్ ఫోరం చైర్మన్ డాక్టర్ రవి కృష్ణ, క్యాబినెట్ కార్యదర్శి రామరాజు,మాజీ గవర్నర్ డాక్టర్ జి. బాల మద్దయ్య, పాల్గొన్నారు. లయన్స్ జిల్లా గవర్నర్ నాగేశ్వర రావు యాదవ్ జ్యోతి ప్రజ్వలన చేసి సమావే శాన్ని ప్రారంభించారు. అనంతపురం, కర్నూలు, నంద్యాల, కడప,అన్నమయ్య, నెల్లూరు, సత్యసాయి జిల్లాలలో ఉన్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు, నంద్యాల లయన్స్ క్లబ్ చెందిన సీనియర్ నాయకులు శ్రీకాంత్, రవి ప్రకాష్,చంద్రమోహన్,కోశాధికారి మామిల్ల నాగరాజు, ఉపాధ్యక్షులు కూర ప్రసాద్, స్వామి రెడ్డి, సందీప్, కన్నయ్య తదితరులు సమావేశంలో పాల్గొ న్నారు. సమావేశంలో గత మూడు నెలల కాలంలో జరిగిన కార్యక్రమాలు సమీక్షించుకొని, రానున్న ఆరు నెలలకు కార్యక్రమాల రూపకల్పన చేశారు. ఈ సమావేశంలో నంద్యాల లయన్స్ క్లబ్ తరపున గవర్నర్ నాగేశ్వర రావు యాదవ్, వైస్ గవర్నర్లు గౌతం, గోపాలకృష్ణ, పాస్ట్ గవర్నర్లు చంద్రప్రకాష్, బాల మద్దయ్య లను ఘనంగా సత్కరించారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న లయన్స్ గవర్నర్ నాగేశ్వరరావు యాదవ్

వనభోజనాలు బంధాన్ని పెంచుతాయి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బనగానపల్లె

కార్తీక వనభోజనాలు స్నేహ సంబంధాలను పెంచుతాయని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని కాశయ్య తోటలో పట్టణ హోటల్స్ టీ స్టాల్స్ బేకరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో కులాలకు, మతాల కు అతీతంగా కార్తీక వనభోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమా నికి ముఖ్య అతిథులుగా వైసీపీ అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి వైసిపి యువ నాయకులు కాటసాని ఓబుల్ రెడ్డి, హోటల్ అసోసియేషన్ కర్నూలు జిల్లా సెక్రటరీ విజయకుమార్ రెడ్డి,వైసిపి నాయకులు అబ్దుల్ ఫైజ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ బనగానపల్లె పట్టణ హోటల్స్ టీ స్టాల్ బేకరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో కులాలకు మతాలకు అతీతంగా కార్తీక వనభోజనం ఏర్పాటు చేయడం హర్షనీయం అన్నారు. దీన్ని స్ఫూర్తిగా తీసుకొని తాను కూడా వచ్చే సంవత్సరం కార్తీకమాసంలో నియోజకవర్గంలో అన్ని కులాల మతాల వారికి కార్తీక వన భోజన మహోత్సవ కార్యక్రమం ఏర్పాటు చేస్తానని తెలిపారు. బనగానపల్లె పట్టణంలో రోడ్డు వెడల్పు కార్యక్రమానికి సహకరిం చిన హోటల్స్,వ్యాపారస్తులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని, ఎమ్మెల్యేగా తనను మళ్లీ అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో బనగానపల్లె హోటల్స్ టీ స్టాల్ బేకరీ అసోసియేషన్ అధ్యక్షుడు సంఘం హోటల్ హైదర్ , వైస్ ప్రెసిడెంట్ నాగరాజు, సెక్రెటరీ శ్రావణ్ కుమార్, రాయల్ కూల్ డ్రింక్స్ సుబ్బరాయుడు, గౌరవ సలహాదారులు సజ్జాత్ హుస్సేన్, ప్రసాద్, వేణు, శంకర్ నాయక్, చాంద్ భాషా, గౌస్, రెహన్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

గ్రామీణ రోడ్లను పట్టించుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి - మిడుతూరు

మిడ్తూర్, రాష్ట్రంలో అంతర గ్రామీణ రహదారులు, ప్రధాన రహదారులు ధ్వంసమైన ప్రజలు, ప్రయాణికులు బాధపడుతున్న రాష్ట్ర ప్రభుత్వానికి చలనం లేకపోవడం దారుణం అని సిపిఎం నాయకులు పీ పకీర్ సాహెబ్, టి గోపాలకృష్ణ, సి నాగన్న అన్నారు. ఆదివారం నాడు వారు చౌటుకూరు నుండి ఓర్వకల్లు వెళ్లే రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు పి, పకీర్ సాహెబ్, టి గోపాలకృష్ణ, సి నాగన్న మాట్లాడు తూ నియోజకవర్గంలో ప్రజలు బాధపడుతున్న పాలకులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఓర్వకల్లు విమానాశ్రయానికి వెళ్లే రోడ్డు ఇంత అధ్వానంగా ఉందని వారు విమర్శించారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఇద్దరు ఎంపీలు, 14 మంది ఎమ్మెల్యేలు, అధికార పార్టీకి ప్రజలు ఇచ్చినప్పటికీ వారి సమస్యలు తీర్చడంలో ప్రజాప్రతినిధులు నిమ్మకు నీరు ఎత్తినట్లు వ్యవహరిస్తున్నారని అన్నారు. ఈ నెలలో సీఎం పర్యటనలో రోడ్డు బాగు చేయాలని నిరసన వ్యక్తం చేసి సీఎం దృష్టికి తీసుకుపోయేందుకు సిపిఎం కృషి చేస్తోందన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు, స్పందించి చౌటుకూరు నుండి ఓర్వకల్లుకు కొత్త రోడ్డు వెయ్యా లని వారు డిమాండ్ చేశారు. చిన్న మద్దయ్య, షేక్షావలి, నాగార్జున, చంద్ర, లక్ష్మీదేవి, తదితరులు పాల్గొన్నారు.


రోడ్డును పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

ఘనంగా తొగట వీర క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో

కార్తీక వనభోజనం

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

నందికొట్కూరు పట్టణంలోని వి.ఎస్.ఎన్ ఫంక్షన్ హాల్ నందు ఆదివారం నాడు తొగట వీర క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో కార్తిక వన భోజ నాలను ఘనంగా నిర్వహించుకున్నారు. ఉదయం వివిధ ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించి వనభోజన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తొగట వీర క్షత్రియ సంఘం అధ్యక్షులు చింతా రామకృష్ణ, గౌరవ అధ్యక్షులు మేకల రామచంద్రుడు, సెక్రటరీ వీరణాల ప్రసాద్, ట్రెజరర్ పాణ్యం నాగరాజు, జాయింట్ సెక్రెటరీ బత్తుల శ్రీరాములు, వైస్ ప్రెసిడెంట్ గుద్దేటి కృష్ణుడు, తొగటవీర క్షత్రియ సంఘం పెద్దలు, మహిళలు పిల్లలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నేటి నుంచి నైనాలప్ప తిరుణాల

ప్రజాశక్తి - సంజామల

మండలంలోని అక్కంపల్లి పరిధిలోని నైనాలప్ప ఓంకారేశ్వరుని తిరుణాల కార్తీక కడ సోమవారం నేటి నుంచి రెండు రోజులపాటు తిరుణాల జరుగు తుందని నిర్వాహకులు తెలిపారు. తిరుణాల్లో ఎద్దుల పందెములు భజన పోటీలు జరుగునని, ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఎద్దుల పందెములను ప్రారంభిస్తారన్నారు. మహిళలు విరివిగా పాల్గొని ఓంకారేశ్వరుని తిరుణాలను వీక్షిస్తారని నిర్వాహ కులు తెలిపారు. బందోబస్తు ఎస్సై ప్రతాప్ ఆధ్వర్యం లో ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

వెలుగోడులో వికసిత్ భారత్ సంకల్పయాత్ర

ప్రజాశక్తి - వెలుగోడు

మండల పరిధిలోని రేగడ గూడూరు, వేల్పనూరు గ్రామపంచాయతీలో వికసిత్ భారత సంకల్పయాత్ర కార్యక్రమాన్ని ఏవో పవన్ కుమార్ ఆధ్వ ర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు అందిస్తున్న పథకాల గురించి వివరించారు. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం కింద ప్రతి రైతు కుటుంబానికి ఏడాదికి ఆరువేల రూపాయలు కేంద్ర ప్రభుత్వం ఇస్తుందని తెలిపారు. రబీలో సాగు చేసిన పంటలు వెంటనే పంట నమోదు చేసుకోవాలని, రైతుకి యూరియా కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ 2000 రూపాయలు కేంద్ర ప్రభుత్వం చెల్లిస్తుందని కేవలం రెండు 267 రూపాయలు మాత్రమే రైతులు చెల్లించాలని రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అంబాల ప్రభాకర్ రెడ్డి, దేశం తిరుపం రెడ్డి, వేల్పనూరు గ్రామ సర్పంచ్ సర్దార్, రేగడ గూడూరు సర్పంచ్ రజియాబి, నంది రెడ్డి, ఎంపీడీవో షేక్ అమనుల్లా పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏవో పవన్ కుమార్



జిల్లాస్థాయి చదరంగం పోటీల విజేతలతో అతిథులు

చదరంగం విజేతలకు ట్రోఫీలు అందజేత

ప్రజాశక్తి - నంద్యాల

ఆంధ్రప్రదేశ్ చెస్ సంఘం ఆధ్వర్యంలో నంద్యాల జిల్లా చెస్ సంఘం నిర్వహణలో శనివారం స్థానిక హనీఫ్ నగర్‌లో ఉన్న రోటరీ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో జరిగిన జిల్లా స్థాయి చదరంగం పోటీలలో విజేతలకు పతకాలు ట్రోఫీలు అందజేశారు. నంద్యాల జిల్లా చెస్ సంఘం ప్రధాన కార్యదర్శి రామసుబ్బారెడ్డి ఆదివారం నిర్వహించిన బహుమతి ప్రధానోత్సవంలో నంద్యాల జిల్లా చెస్ సంఘం అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ, రోటరీ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రిన్సిపల్ సుబ్బయ్య, నంద్యాల లయన్స్ క్లబ్ కార్యదర్శి సోమేశుల నాగరాజు వివిధ వయసు కేటగిరీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ గెలిచినవారు తమ గెలుపు స్థానాన్ని నిలబెట్టుకోవడానికి, విజయం అందుకొని వారు తదు పరి పోటీలలో విజయాలు సాధించడానికి కోచ్ ల పర్యవేక్షణలో నిత్య సాధన చేయడం ద్వారా క్రీడలలో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని అన్నారు. ఆ విధమైన అంకితభావం, క్రమశిక్షణ క్రీడాకారులకు చాలా అవసరం అన్నారు. నంద్యాల జిల్లా చదరంగం పోటీ విజేతలు: షలీం మణికుమార్, షేక్ అద్నాన్ అమీన్, దీక్ష శ్రీ, యుగంధర్ విజేతలుగా నిలిచాని తెలిపారు.

సుబ్బారాయుడు స్వామికి బంగారు గొలుసు విరాళం

ప్రజాశక్తి - పాణ్యం

మండలం లోని ప్రముఖ శైవక్షేత్రం శ్రీ కొత్తూరు సుబ్బారాయుడు స్వామికి భక్తులు విలువైన కానుకలు సమర్పించారు. పాణ్యం మండలం కొనిదేదు గ్రామానికి చెందిన 20 గ్రాముల 800 మిల్లీ గ్రాముల బంగారు తాళిబొట్టు గొలుసు, నంద్యాలకు చెందిన సురేష్ 2 గ్రాముల 600 మిల్లీ గ్రాముల బంగారు పడిగే, తాండ్రపాడు గ్రామానికి చెందిన లోకాంక్ష్ కృష్ణ యాదవ్ 795 గ్రాముల వెండి నాగ పడగ విరాళంగా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆలయ ఇఒ రామకృష్ణ దేవస్థాన సిబ్బంది సుబ్బారెడ్డి, అర్చకులు నారాయణ స్వామి దాతలకు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అలాగే కార్తీకమాసం చివరి ఆదివారం కావడంతో భక్తులు స్వామి వారిని దర్శించుకొనడానికి అధిక సంఖ్యలో వచ్చారు. పాణ్యం ఎస్ఐ అశోక్ ఆధ్వర్యంలో పోలీసులు బందబస్తు ఏర్పాటు చేశారు.

అంతర్జాతీయ క్రీడాకారినికి ఇరిగెల అభినందన

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో అంతర్జాతీయ స్థాయి జంప్ రోప్ పోటీలలో ఆడేందుకు థాయిలాండ్ వెళ్తున్న ఆళ్లగడ్డ మండలం ఆర్.కృష్ణాపురం గ్రామానికి చెందిన క్రీడాకారిణి సమీరాను ఇరిగెల సోదరులు అభినందించారు. ఆళ్లగడ్డ తాలూకా జనసేన పార్టీ నాయకులు ఇరిగెల రాం పుల్లారెడ్డి, అధికార ప్రతినిధి ఇరిగెల సూర్యనారాయణ రెడ్డి తదితరులు అభినందించి అంతర్జాతీయ స్థాయి పోటీల్లో మొదటి స్థానంలో విజేతగా నిలవాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో సమీరా కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



క్రీడాకారిణ్ని అభినందిస్తున్న ఇరిగెల

బైక్ - బొలెరో వాహనం ఢీ కొని

- పలువురికి గాయాలు

ప్రజాశక్తి - బేతంచెర్ల

బేతంచెర్ల పట్టణంలోని బనగానపల్లె రహదారిలో కస్తూర్బా స్కూలు సమీపంలో జగనన్న లేఅవుట్ వద్ద బొలెరో జీపు ద్విచక్ర వాహనం ఢీ కొట్టు ఉన్న సంఘటన చోటుచ సుకుంది. వివరాల మేరకు.. డోన్ పట్టణం నుండి సుబ్బరాయునీ కొత్తూరుకు వెళ్తున్న బొలె రో వాహనం జగనన్న లేఅవుట్ వద్ద నుండి వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో ద్విచక్ర వాహనంపై వస్తున్న బేతంచెర్ల పట్టణ వాస్త వ్యులు సుధాకర్, బొలెరో వాహనంలో ప్రయా ణిస్తున్న వెంకట రాముడుతో పాటు మరో ము గ్గురికి గాయాలయ్యాయి. వీరిని 108లో పట్టణ ంలోని శేషారెడ్డి ప్రభుత్వ ఆసు పత్రికి తరలించి ప్రథమ వైద్యం చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు.

